నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

## సప్త పదులు

జీవన
దీవన
చీకటి విదిల్చిన ఆలోచనే ఒక నిశ్శబ్దభావన
అడుగు
తొడుగు
తడబడిన చరిత్రలో నిలుస్తుంది ఇతిహాసం గొడుగు
అలుసు
పెళుసు
రెండు హృదయాలు తడబడితే ప్రేమకంట్లో నలుసు



-వై. పద్య
సెల్:9396999376

## ఘంటారావం

నష్టపడితేనే
కష్టపడతారు
కష్టపడితేనే
ఇష్టపడతారు.
జననం టేకాఫ్ అయితే
జీవనం క్రూజింగ్
మరణం
ల్యాండింగ్.
సంపదే
సర్వస్వమనుకోకు
సహజత్వాన్ని
కోల్పోకు

అధికంగా
ఆధారపడకు
అదేపనిగా
బాధపడకు.
రహదారులపై
గుంతలు
ప్రయాణీకుల
కౌగిలింతలు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964













# డా॥ఎన్. గోపి గారి "రేపటి మైదానం"లో విహరిద్దాం రండి!

**పెద్ద పెద్ద పదవులు నిర్వహించాను**
**కాని కవి అన్న గుర్తింపే నాకు పలకరింపు..**
**మా యింటి నిండా పుస్తకాలు**
**ర్యాకుల నిండా... కుర్చీల నిండా**
**మార్గదర్శనం చేసే మహానుభావుల్లా**
**రెప రెప లాడుతుంటాయి..**
**ఎప్పటికీ మారని ప్రాణ స్నేహితుల్లా పలకరిస్తాయి** అంటూ అక్షరమే తమ శ్వాసగా.. ధ్యాసగా జీవనం కొనసాగిస్తున్న ప్రసిద్ధ కవి డా॥ ఎన్.గోపిగారు రచించిన **"రేపటి మైదానం"** కవితా సంపుటిలో.. ఆయన వ్యక్తిత్వాన్ని కవిత్వాన్ని చదివి ఒకింత పరవశించి పోతాం.. మనల్ని మనం మైమరిచి పోతాం.. బహుగ్రంథకర్తగా, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్స్‌లర్‌గా.. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతగా.. ఓ ప్రసిద్ధ కవిగా మాత్రమే మనకు చాలా మంది గుర్తుంటుంది. కానీ ఆయన కవితా పంక్తులు చదువుతుంటే.. ఆయనలో ఓ తాత్త్వికుణ్ణి, మానవీయ విలువలున్న ఓ గొప్ప మనిషిని ఓ సున్నిత మనస్తత్వం వున్న వ్యక్తిని.. లోక పరిశీలనపై అపార పట్టు ఉన్న అతనిలోని లోకజ్ఞతను.. స్నేహానికి పట్టం కట్టే నేస్తాన్ని.. అన్నింటికి మించి.. ఆయన సృజనాత్మక శక్తిని.. దేన్నయినా.. సులభంగా లోతైన భావాలతో అభివ్యక్తీకరించే విలక్షణ అభివ్యక్తిని.. చక్కని శిల్పంతో కవితా వస్తువుకు శోభను పెంచే ఆయన చతురతను చూడగలం.. కవిత్వం అంటే ఇలా ఉండాలన్న ఓ అవగాహనను పొందగలం.. లోతైన ఆలోచనలతో ఆయన ప్రకటించే భావధారను అంత సులభంగా పట్టుకోలేము.. ఒకటికి రెండు సార్లు చదివితే తప్ప..

> **డా॥ ఎన్.గోపిగారి కవిత్వం అలతి అలతి పదాలతో కనపడి నప్పటికీ.. ఆయన అపార అనుభవాన్ని. లోక పరిశీలనను జోడించి ప్రయోగించిన పదాల పరదా మాటున దాక్కొని వున్న భావాన్ని గ్రహించగలిగితే పాఠకులుగా మనం గొప్ప అనుభూతికి లోనవుతాం..**

ఆయన కవిత్వాన్ని.. ఆయన రచనా వైచిత్రిని.. ఆయన ఎంపిక చేసుకున్న వస్తువు వెలుగులో.. ఔచిత్య పదబంధ ప్రయోగంతో.. కవితను ఎలా మలిచారో అర్థం చేసుకోలేం.. పైకి డా॥ ఎన్.గోపిగారి కవిత్వం అలతి అలతి పదాలతో కనపడి నప్పటికీ.. ఆయన అపార అనుభవాన్ని. లోక పరిశీలనను జోడించి ప్రయోగించిన పదాల పరదా మాటున దాక్కొని వున్న భావాన్ని గ్రహించగలిగితే పాఠకులుగా మనం గొప్ప అనుభూతికి లోనవుతాం.. చిన్ని చిన్ని మాటలతో ఇంత గొప్ప భావ ప్రకటన చేయొచ్చా అన్న ఒకింత ఆలోచనలో తేలియాడుతాం.. డా॥ ఎన్.గోపి గారి కవిత్వం చదువుతుంటే.. ఎంతో ఆత్మీయంగా.. శీర్షిక.. ఎత్తుగడ, నిర్వహణ.. ముగింపు వరకు మనల్ని ఇట్టే తీసుకెళ్లే కవితా పంక్తులుంటాయి. డా॥ గోపిగారి కవిత్వం యొక్క మరో ముఖ్య లక్షణాన్ని మనం గమనించినట్లయితే.. కవిత ముగింపులో వారు ప్రయోగించే పద బంధాలు.. కొసమెరుపుకు మరింత వెలుగుని స్తాయి. చలో క్తులతో.. విరుపులతో చమత్కారంతో.. వ్యంగ్యాస్త్రాలతో ముగించే ఆయన కవితలు పాఠకుని మనసులో ఎప్పటికీ గుర్తుండేలా ఉంటాయి. పదే పదే హృదయాంతరాల్లో నవ్వడి చేస్తాయి. మనో ఫలకంపై నాట్యం చేస్తూ ఒకింత సాంత్వననిస్తాయి. అంతేగాక గొప్ప సందేశాన్నిస్తాయి. ఎంపిక చేసుకున్న కవితా వస్తువుకు మరింత బలాన్ని చేకూర్చేలా.. పాఠకుని మెప్పించేలా డా॥ గోపిగారు తమ కవితల్ని చక్కని కొసమెరుపులతో ముగించడం వారి ప్రత్యేకత. డా॥గోపి గారి కవిత్వంలో జీవం వుంటుంది. జీవితమూ ఉంటుంది. ప్రతి కవితలో నర్మ గర్భంగా ఓ గొప్ప సందేశమూ ఉంటుంది. పాఠకుణ్ణి ఆలోచనలో ముంచేస్తుంది.

డా॥ ఎన్.గోపి గారి అమృతోత్సవ సందర్భంగా 75 కవితల సమాహారంగా "రేపటి మైదానం" పేరుతో జూన్ 2024లో ఓ కవితా సంపుటిని వెలువరించారు. డా॥ఎన్.గోపిగారి తొలి కవితా సంపుటి "తంగేడు పూలు" పైన తొలి వివేచన చేసిన ఆయన సహృదయ మిత్రుడు. తెలుగులో పట్టనంత పెద్ద విమర్శకుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారికి ప్రేమతో ఈ పుస్తకాన్ని అంకితమివ్వడం ఆహ్వానించదగింది.

ఇక ఇందలి కవితల్ని పరిశీలిద్దాం.. ఆస్వాదిద్దాం.. గొప్ప అనుభూతిని పొందుదాం..

**"కవిత్వమూ అంతే"** కవితలో.. పెన్సిల్‌ను షార్పనర్‌తో తిప్పుతుంటే.. చెక్కులు ఊడొస్తాయి. అందంగా పువ్వుల్లా గిర్రున తిరుగుతాయి. ముల్కి పదునెక్కడానికి అది పడే గాయాల బాధ వర్ణనాతీతం... కవిత్వమూ అంతే.. కుహరా ల్లోంచి.. వెలుగు సీమను వెతికే పని దానిది.. మానసిక స్థితికీ జీవన గతికీ మధ్య కొట్టుమిట్లాడే వ్యధ దాని విధి అనీ.. అరిగిపోయిన మాటల్ని జల్లెడ పట్టగా పట్టగా.. మిగిలే ఒకటి రెండు గింజలే నీ వ్యక్తిత్వం.. ప్రయాణం పాతదే.. గానం మాత్రం ఇవాలిటిది అని కొనసాగించిన తీరు బాగుంది.

కవిత్వమంటే అల్లాటప్పా వ్యవహారం కాదనీ.. అదొక చింతనామృత.. మథమని తేల్చి చెప్పారు.

పెన్సిల్ ములికి అరిగిపోవచ్చు... పెన్నులో సిర తరిగిపోవచ్చు.. భావాలకేం కొదువ.. అవి పరంపరలుగా తరలి వచ్చే కెరటాల యాత్ర అని చెప్పడం డా॥ఎన్.గోపిగారి కవితా పటిమను చాటే విధంగా ఉంది. కవిత ముగింపులో.. గాయాల మాల ధరించిన.. ఆదివాసి లాంటిది కవిత్వమనీ.. శాపంగా పరిణమించిన వరమనీ.. అందమైన తత్వమని డా॥ గోపిగారు కవిత్వం గురించిన ఆలోచనలను చక్కగా అక్షరాల ఆవిష్కృతం చేశారు.

డా॥ ఎన్.గోపి గారి కవిత్వంలో సంభాషణలు జొప్పించి పాఠకులను మెప్పించే మరో సుగుణాన్ని గమనిస్తాం. "తీరిక" కవితలో.

**"ఏం చేస్తున్నారీ మధ్య**
**రిటైరైనారు కదా..**
**ఎట్లా గడుస్తుంది"** అడిగాతడు..
చదువుకుంటున్నాను
రాసుకుంటున్నాను.
"అది కాదు, ఇంకేం చేస్తున్నారు"
"సభలకూ సమావేశాలకు వెళ్లొస్తున్నాను పత్రికల్లో విహరిస్తున్నాను."
**"అది కాదు**
**వాకింగ్ నుంచి ఇంటి కెళ్లగానే**
**ఏం తోస్తుంది మీకు"**
**"బాల్కనీలో నిలబడి**
**అందరినీ పరిశీలిస్తాను**
**తమ కోసం కాక**
**ఒక్కరైనా ఇతరుల కోసం**
**నడుస్తున్నారా అని ఆలోచిస్తాను"**
రాత్రంతా వొంటి కంటిన
నిద్ర బూజును కిరణాల్తో దులుపుకుంటూ
స్వప్నాలను సాన బెట్టుకుంటాను"

ఇలా మరికొన్ని ప్రశ్నలకు సమాధానాలు యిస్తూ కొనసాగించారు. డా॥ఎన్.గోపిగారు తమ కవితా రచనకు సంబంధించిన ప్రతిభ ను ఈ కవితలో చూడగలం..

**"తీరిక లేదంటారు**
**కాలక్షేపం కోసం వస్తానంటే వద్దంటారు**
**నిర్వ్యాపార పారాన్ని ముట్టిన**
**నిరంతర స్తబ్ధ శబ్దంలా**
**ఏమిటో మాట్లాడుతున్నారు**
**ఇంతకూ మీరేం చేస్తున్నారు"**
**మనుషుల్ని కలుస్తున్నాను**
**ప్రయోజకత్వమంటే ఏమిటో**
**తరచి చూస్తున్నాను.**
**గతంలో చేసిన పనికిమాలిన పనుల్ని**
**సమీక్షిస్తున్నాను..**
**మా ఆవిడను మరింత పరిచయం చేసుకుంటున్నాను.**
**పిల్లల్ని ప్రేమగా విపులంగా గమనిస్తున్నాను.**

ఇంకా ఈ కవిత చివరన.. ఇలా రాశారు.

**గతం కంటే వర్తమానమే**
**విలువైందని అవగతం చేసుకుంటున్నాను**
**భవితవ్యాని ఆహ్వానం పలుకుతున్నాను**
**గానుగెద్దు జీవితానికి స్వస్తి చెప్తూ**
**ఏనుగెక్కినంత సంబరపడి పోతున్నాను.**
**నాకు కాదు..**
**నా మనసుకు తీరిక లేదని**
**విన్నవించుకుంటున్నాను** అని ఓ మంచి ముగింపునిచ్చారు. తీరిక లేనిది తనకు కాదనీ.. తన మనసుకు తీరిక లేదని తేల్చి చెప్పారు.

**"ద్వైధీ"** కవితలో.. పల్లెకు.. పట్నంకు మధ్య వున్న వ్యత్యాసాలను చక్కగా తెలియజెప్పారు.

**పల్లె, పట్నం**
**రెండూ అతనిలోనే**
**అమాయకత్వం గడసరితనం**
**ఒకే వొరలో రెండు కత్తులు**
**సంఘర్షణ బహుకష్టం!**

పల్లె ప్రశాంత చేతన అనీ.. పట్నం అల్లకల్లోల సృజన అనీ. ఒకటి నదైతే.. మరొకటి మహాసముద్రమని వ్యాఖ్యానించారు. పల్లె మనసును వీడదనీ.. పట్నంలో శ్వాస ఆడదనీ.. క్రమంగా ఒక్కో మెట్టే ఎక్కుతూ.. నింగిలాంటి ఒంటరితనంలోకి అని చెప్పడంలో వాస్తవముంది.

**ఒకప్పుడు**
**పల్లె పట్నం వైపుపారే యేరనీ**
**ఇప్పుడు పట్నం**
**గండి పడి పల్లెల్ని ముంచేస్తున్న తీరు**
అని వివరించారు.
**పల్లెను పూర్తిగా వదల్లేక**
**పట్నంలో ఇమడ లేక**
**తనలోకి తాను కుంచించుకుపోయే మనిషితనం..**
**ఈ శబ్దాలు**
**శతాబ్దాల నాటివి, అర్థాలు మాత్రం**
**కొత్తగా గమ్మత్తుగా**
**నడకలో కాళ్ళు తడబడుతున్నాయి**
**ఇదే నేటి చరిత్ర** అని చాటి చెప్పారు.

పై కవితలో వాస్తవాలకు పెద్ద పీట వేస్తూ..ఓ రకంగా పట్నం కన్నా పల్లె నయమని చెప్పకనే చెప్పారు.

''ఆగని నడక'' కవితలో వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యల్లో ముఖ్యంగా మోకాళ్ల నొప్పుల జీవన సంధ్యలో.. వృద్ధుల జీవన సరళిని ఆవిష్కరిస్తూ.. ఈ కవితను నడిపించారు.

**ఒకనాడు.. తినేటప్పుడు**
**రుచి కోసం ఆరాటపడే వాళ్లు**
**ఇప్పుడు**
**యాంత్రిక భోజనం..**
**వాహనాలు నడపడం వదిలేశారు.**
**కష్టపడి సెల్‌ఫోన్లు నేర్చుకున్నారు**
**బుడ్డోళ్లను స్కూలుకు**
**తీసుకెళ్తున్నారు.**
**వాడు కొండను పట్టుకుని**
**గంతులేస్తున్న రాయిలా వున్నాడు.**
**పౌరుషంతో**
**స్టూలెక్కి మేకులు కొడతానంటా డొకాయన**
**వొట్టిగా కూర్చోలేడంటూ**
**గట్టిగా మాత్రం అరుస్తాడు..**
అంటూ సగటు వృద్ధుని దిన చర్యను ఏకరువు పెట్టారు.
**ఇంట్లో అందరూ కలిస్తే అతడు**
**బాధ్యత అతని కథ**
**ఇన్నాళ్లూ కనపడని**
**ప్రతి సూక్ష్మాంశం**
**అతనికి పరిశోధనాంశమని** పేర్కొన్నారు.
ఇంకా జ్ఞాపకాలే అతనికి మిగిలిన సంపద అనీ..
**వర్తమానాన్ని**
**తన అనుభవాల్లోకి అనువదించుకుని**
**తులనాత్మక పరిశీలన చేస్తున్నాడు**
**నిజానికి అది తేలిపోయే బెండు కాదు**
**ఓ అందమైన బ్లెండ్** అని వ్యాఖ్యానించారు.

కవిత చివరలో.. ఆశవహ దృక్పథంతో కవి డా॥ గోపిగారు ప్రకటించిన భావాలు.. బాగున్నాయి. వృద్ధాప్యానికి సరైన భాష్యాన్ని చెబుతూ.. నడకను ఆవిష్కరించారు.

**నడుస్తున్నారు**
**అందరూ వృద్ధులే**
**మృత్యువైపుకు మాత్రం కాదు**
**మళ్లీ సరికొత్త జీవితం వైపు**
**ఆత్రంగా నడుస్తున్నారు..**

ఈ కవితలో డా॥ గోపిగారు మార్నింగ్ వాక్‌ను దృశ్యమానం చేయడంతో పాటు.. నడకను ఆగని నడకగా పేర్కొంటూ.. మళ్లీ సరికొత్త జీవితం వైపు ఆ నడక అని చెప్పడం బాగుంది.

**నిశ్శబ్దం**
**నాకు శత్రువు**
**శబ్దం**
**నా క్రతువు** అంటూ "అంతర్జ్వాల" కవితను రాశారు.
**నిద్ర మేల్కొనడానికీ,**
**రేపటి మీద**
**ముద్ర వేయటానికే..** అని కొనసాగించారు.
**దిగులుదేముంది**
**అది నేలకు పగులు లాంటిదనీ**
**నా కలం జిగురుతో**
**పూడ్చేస్తాను..** అని అంటూ డా॥ గోపిగారు వృద్ధాప్యాన్ని దరి చేరనీయననీ..నా రచనా వ్యాసంగంతో దాన్ని అధిగమిస్తానన్న అర్థం ధ్వనించే విధంగా స్వాభిమాన పూర్వక భావ ప్రకటన చేశారు.

**ఒంటరితనాన్ని**
**తరిమి కొడతాను..**
**ప్రతి మనిషినీ**
**లోపలికి తీసుకుంటాను..**
**నిశ్శబ్దాన్ని**
**మిత్రుడిగా మార్చుకుంటాను**
**దానికి మాటలు పూయిస్తాను**
అని కవిగా తన కర్తవ్యాన్ని గుర్తు చేసుకున్నారు.

డా॥ఎన్.గోపి గారు ప్రతి రోజు ఉదయం వచ్చే వార్తా పత్రికపై ఆలోచనాత్మక కవితను రాశారు. ఉషోదయాన పత్రిక రాకముందే కవిత్వ రచన ప్రక్రియ పూర్తి చేసుకోవాలనీ.. లేదంటే వార్తా పత్రిక కథనాలు.. ఆ రోజు కవితను రాయనివ్వవన్న అంశాన్ని.. 'ఒక రోజు" కవితలో తమ అనుభవాలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

ఏముంటుంది పేపర్లో?
**రాజకీయ వేటగాళ్లు బయలు దేరుతారు**
**గుమ్మడి కాయంత శీర్షికలు.**
**భాష ఇంత మలినం కావడం**
**మును పెన్నడూ చూడలేదని** వాపోయారు.
**రాత్రంతా నిద్రకాచి**
**పాత్రికేయులు చెక్కిన అశబ్ద శిల్పాలని** పేర్కొన్నారు.
**పేపర్ నిండా అకవిత్వం**
**కొన ఊపిరి మానవత్వం**
**అబద్ధాలు, అశుద్ధాలు** అంటూ ఇప్పుడొస్తున్న వార్తా పత్రికల్లో వస్తున్న వార్తలపై.. వాటిలో వాడే భాష గురించి డా॥ గోపి గారు నిర్మోహమాటంగా తమ భావాలను మనతో పంచుకున్నారు. సంచలనం కోసం వార్తా పత్రికల్లో రాయబడే రాతలు ఎలా డిస్టర్బ్ చేస్తాయో ఈ కవితలో చక్కగా తెలియజెప్పారు.

పెద్ద పెద్ద ఆశలతో.. తమ పిల్లల బాల్యాన్ని హాస్టళ్లలో కార్పొరేట్ స్కూళ్లలో ఎలా బంధీ చేస్తున్నారో **"పసివాడి లోకం"** కవితలో డా॥గోపి గారు ఆర్ద్రంగా ఆవిష్కరించారు.

**పెద్ద పెద్ద ఆకాంక్షలతో**
**వాడి బాల్యాన్ని ధ్వంసం చేస్తున్నారు.**
**వాడి చిన్ని పాదాల్ని**
**చైనా బూట్లలో కుక్కుతున్నారు.**
**వాడిలో ఏవో చెట్లు కూలుతున్న పెను శబ్దాలు..**
**వాడే అలవాటు పడతాడని తండ్రి**
**పాడు చదువు లేకుంటేమాయె అని తల్లి**
**ఫౌల్ట్రీ ఫాంలో**
**కోడి పిల్లలు వాడికన్నా నయం**
అని కవి తమ ఆవేదనను ప్రకటించారు.

**"తెలంగాణ దైవం"** కవితలో యాదగిరి గుట్టపై వెలిసిన నరసింహ స్వామిని కవితాత్మకంగా ప్రస్తావించారు. ప్రస్తుతించారు.

**యాదగిరి తెలంగాణ సిగలో**
**నిగ నిగలాడే ధ్యాన విరి అనీ..**
**భక్తి భావ సిద్ధికీ**
**రౌద్ర రస సమృద్ధికీ**
**ప్రసిద్ధి కెక్కిన పౌరాణిక ఝురి**
అని అభివర్ణించారు.
**యాదగిరేంద్రా!**
**తెలంగాణ జనుల గుండెల్లో**
**ప్రసన్నతను విరియింపజేసే**
**మనోహర మృగేంద్రా**
**నువ్వున్న చోట ఉంటాయి ఏడ్పులు**
**నీకివే.. నాకై మోడ్పులు** అంటూ మంచి ముగింపునిచ్చారు. డా॥ ఎన్.గోపిగారు **"క్యాటరాక్ట్ సర్జరీకి ముందు"** కవితలో కళ్ల యొక్క ప్రాశస్త్యాన్ని విడమరిచి చెప్పారు.

కనుగుడ్డు భూగోళమంత ముఖ్యమైందనీ.. అది దృష్టి.. ఇది అనంత సృష్టి.. కన్ను తెరిస్తే అది దృశ్యం.. మూసుకుంటే ఒక స్వప్నం అని ప్రకటించడం బాగుంది. ఇంకా కళ్లను గురించి ఇలా రాశారు.

**కండ్లు దేహానికి కిటికీలు..**
**నాలుకను మించిన**
**బహుభాషా వేదికలు..**
**ఇంత జలం**
**ఎక్కడి నుండి ఊరుతున్నట్టు?**
**బాష్పాలు**
**భావుక పుష్పాలు..**అంటూ చక్కని భావుకతను ప్రదర్శించారు. **"జీవించడమే జీవితం"** కవితలో ఎన్. గోపి గారు తమ తాత్త్వికతను ప్రదర్శించారు.

**జీవితాన్ని గురించి**
**ఎప్పుడూ ఆలోచించలేదు..**
**జీవించడం తప్ప..**
**నిర్వచనాలూ విశ్లేషణలూ**
**ఇష్టం లేని పనులు నాకు** అంటూ ఈ కవితను ప్రారంభించిన తీరు బాగుంది.
**గడిచిన జీవితాన్ని**
**జ్ఞాపకాల్లో నెట్టెయ్యడం కంటే**

> **డా॥ఎన్.గోపి గారి కవిత్వంలో జీవం వుంటుంది. జీవితమూ ఉంటుంది. ప్రతి కవితలో నర్మ గర్భంగా ఓ గొప్ప సందేశమూ ఉంటుంది. పాఠకుణ్ణి ఆలోచనలో ముంచేస్తుంది.**

**మళ్లీ కొత్తగా జీవించడం**
**నేర్చుకుంటేనో! కాని..**
**అప్పటికి ప్రేక్షకులు మారుతారని** వ్యాఖ్యానిం చారు. ప్రసిద్ధ నేపథ్యగాయని లతా మంగేష్కర్‌పై **"లత ఒక వొదువని జ్ఞాపకం"** కవితను రాశారు.

రాసిన వాడు సరస్వతీ పుత్రుడైతే
పాడుతున్న ఆమె
**ఒక భావోద్వేగ గాయత్రి అనీ..**
**గానం వెలువడేది**
**ఆమె గళమే కావచ్చు**
**ఆనంద కళాదీప్తి ఆమె** అంటూ కొనియాడారు.

ఇంకా ఈ కవితా సంపుటిలో గోపిగారి టీచర్ అన్నమ్మపై ఓ కవితను రాసి ఆమె పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు.

**''శిలా వీర్రాజు స్మృతిలో..** కవితలో గోపిగారు శీలావీర్రాజు గారితో ఉన్న స్నేహబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

**కవీ చిత్రకారుడనేది ఒక పార్శ్వం**
**సాదా సీదా వ్యక్తిత్వం మీది..**
**గోదావరిని దేశమంత అద్దిన**
**ఆర్ద్ర మూర్తి మీరు..**
**యాభై ఏండ్ల మన స్నేహితం**
**నేటి నుంచి ఒక అఖాతం!**
అంటూ శీలా వీర్రాజుగారి మరణం పట్ల అక్షరాంజలి సమర్పించారు. కవిత్వానికేదీ అనర్హం అని శ్రీశ్రీ గార-న్నట్లు- గోపిగారు ఏ వస్తువైనా కవితామయం చేస్తారు. పాఠకుల్ని మెప్పిస్తారు. **"రొట్టెలు"** కవితలో రొట్టెలు ఎలా చేయాలో చిన్నప్పుడు వాళ్ల అమ్మ చెప్పిన మాటల్ని గుర్తు చేశారు. ఇప్పటి తరం ఎలా రొట్టెలు ఎలా చేస్తున్నారో వివరించారీ కవితలో..

**రొట్టెలు**
**అమ్మాయి చేసింది గాని**
**అది సుదర్శన చక్రంలా**
**నొక్కులు నొక్కులుగా మారి**
**ఆయుధంగా కుదిరిందని..**
**అదొక ధిక్కార స్వరం**
అని వ్యాఖ్యానించారు.

ఇలా ఇందులోని కవితా పంక్తులెన్నో ఉదహరించడానికి.. విశ్లేషించుకోవడానికి.. కవిత్వమెలా రాయాలో తెలుసుకోవడానికి డా॥ఎన్. గోపిగారి కవితా పటిమను మనం ఒంట పట్టించుకోవడానికి యెగ్యంగా ఎన్నో ఉన్నాయి.

**"రేపటి మైదానం"** కవితలో
**ఆటలాడే పిల్లలు**
**భూమిలోంచి డైరెక్టుగా**
**పూచిన పువ్వుల్లా ఉన్నారనీ..**
**గ్రౌండ్‌కు ప్రాణమొచ్చింది..**
**స్తబ్దంలోంచి శబ్దం చిగురించిందని**
చెప్పడం బాగుంది.
**ఇక్కడ ఆడని ఆటల్లేవు**
**ఆ చిట్టి తండ్రి విసిరిన జావెలీన్‌త్రో**
**కాలాన్ని చీల్చుకుంటూ**
**ఇంకా ప్రయాణిస్తూనే ఉంది..**
ఎన్.సి.సి. క్యాడెట్స్ కవాతు చేస్తుంటే..
**దేశం యుద్ధానికి సిద్ధమైనట్టుగా వుంది**
**క్రీడాస్థలం కాస్తా**
**రణ స్థలంగా పరిణమించిందని**
పేర్కొన్నారు.

కవిత్వమెలా ఉండాలో.. దాన్ని చదివితే ఎలా ఉండాలో వివరిస్తూ **"సంసిద్ధత"** కవితను తీర్చిదిద్దారు.

**ఫలానా కవి పద్యం చదివితే**
**మనలో నిద్రాణమై వున్న**
**భావనా పటిమ లేచి నిలబడాలి.**
**మెరుపు మెరిస్తే పరిసరాలు ప్రజ్వరిల్లినట్లుండాలి**
**పూలు పూసే మొక్క**
**రాళ్లను చీల్చుకుని మొలిచినట్టుండాలి**
**కొత్తరక్తం ఎక్కుతున్నట్టుండాలి**
**పద్యంలోకి దిగితే**
**జీవితంలో లీనమైనట్టుండాలి**
**అమ్మ మమతల సరోవరంలో**
**మరోసారి గడిచినట్టుండాలి** అని అంటారు డా॥ గోపిగారు. నిజంగా ఈ అనుభూతుల్లో మనందరం పొందేలా ఆయన కవిత్వం నిండా ఉంటుంది. డా॥ గోపిగారి కవిత్వం చదువుతుంటే.. వారన్నట్లే.. ఎక్కడో హిమాలయాల్లో వీచే గాలి ఇక్కడి దాకా కొనసాగి.. ఇక్కడి వాయు మండలాన్ని మృదువుగా నిమిరినట్టుంటుంది. ఇలా డా॥గోపిగారి "రేపటి మైదానం"లో విహరిద్దాం.. ఆయన అందించిన కవిత్వ మాధుర్యాన్ని ఆస్వాదిద్దాం..



**దాస్యం సేనాధిపతి**
సెల్:9440525544

# పట్టుదల, క్రమశిక్షణతో ఏదైనా సాధ్యమే

పట్టుదల క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, త్యాగరాయ గానసభ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సాహిత్య సవ్యసాచి ద్వానా శాస్త్రి 78వ జయంతిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త డా॥వోలేటి పార్వతీశానికి కిన్నెర-ద్వానా శాస్త్రి స్మారక పురస్కారాన్ని ఆయన ప్రదానం చేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్వానా శాస్త్రి సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరు అయ్యే వారికి బోధకుడిగా, తెలుగు సాహిత్యంపై అవగాహన కలిగించే కాలమిస్ట్‌గా చేసిన భాష సేవ గొప్పదన్నారు. సునిశిత పరిశీలన, నితరంతర అధ్యయనంతో ద్వానా శాస్త్రి తెలుగు సాహిత్యంలో ప్రత్యే గుర్తింపు పొందారని చెప్పారు. ద్వానా శాస్త్రి సాహిత్య అధ్యయనం గొప్పదని కొనియాడారు.

సభాధ్యక్షులు జి.వల్లీశ్వర్ మాట్లాడుతు ద్వానా శాస్త్రి పట్టుదల వ్యక్తి అని తాననుకున్నది సాధించడానికి అహర్నిశలు కృషి చేసేవాడని అన్నారు. "ప్రాచీన కాలం నుంచి నేటివరకు తెలుగు సాహిత్యంలో హాస్యామృతం" రచన పాఠకులను ఆనంద పరుస్తుందని ఆయన చేసిన సాహిత్య సేవ గొప్పదని అన్నారు.

త్యాగరాయ గానసభలో ద్వానా శాస్త్రి నిర్వహించిన సాహిత్య కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించామని ఎన్నో అంశాలపై చేసిన ఆయన ప్రసంగాలు అందరి మెప్పు పొందాయని గానసభ అధ్యక్షులు వి.యస్. కళా జనార్ధనమూర్తి అన్నారు.

బైస దేవదాసు మాట్లాడతు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో తెలంగాణ కోసం ఆత్మహత్యలు చేసుకుంటున్న యువకులను చూసి ద్వానాశాస్త్రి దుఃఖించారని, ఆత్మహత్యలు చేసుకోవద్దని నేటినిజంలో ప్రచురించిన శాస్త్రి గారు



సభలో స్పందన తెలియజేస్తున్న డా॥వోలేటి పార్వతీశం.



డా॥వోలేటి పార్వతీశం దంపతులకు ద్వానా స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్న బైస దేవదాసు, ద్వాదశి శశాంక, డా॥ కే.వి.రమణాచారి, కళా వి.యస్.జనార్ధనమూర్తి, మద్దాళి రఘురాం తదితరులు.

రాసిన కవితను చదివి వినిపించారు. ప్రాంతాలు వేరైనా అక్షరం సర్వాంతర్యామి అని తనలో వున్న జ్ఞానాన్ని పదిమందికి చేరేలా సాహిత్య కృషి చేశారని తెలిపారు.

ఎంతోమంది పాఠకుల, శిష్యుల అభిమాన పాత్రుడు ద్వానా శాస్త్రి అని ఆయన పేరున ప్రతి సంవత్సరం స్మారక పురస్కారం ఇవ్వడానికి కుమారుడు శశికాంత్ ముందుకు రావడం ఆనందంగా వుందని కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాళి రఘురాం అన్నారు.

కిన్నెర-ద్వానా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మొదటిసారి బైస దేవదాసు, రెండవసారి డా॥ కూరెళ్ళ విఠలాచార్య, మూడవసారి వల్లీశ్వర్, ఈసారి డా॥వోలేటి పార్వతీశం గార్లకు ద్వానా స్మారక పురస్కారాలు ప్రదానం చేయడం జరిగిందని మద్దాళి రఘురాం వివరించారు.

ఫలానా వ్యక్తి నా గురువు అని చెప్పుకుంటాం. కానీ ఫలానా వ్యక్తి నా శిష్యుడు అని గర్వంగా చెప్పుకునే గురువులూ వుంటారు. అలా కీర్తింపబడిన వ్యక్తి డా॥ ద్వా.నా. శాస్త్రి అని స్మారక పురస్కార గ్రహిత ప్రముఖ సాహితీవేత్త వోలేటి పార్వతీశం ద్వానా గొప్పతనం గురించి వివరించారు. అంతటి మహోన్నత వ్యక్తి పేర నేనీ పురస్కారం అందుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఓలేటి అన్నారు.

మంచి లక్షణాలతో జీవించాలని హితబోధ చేసి మాకు మంచి జీవితాన్ని ప్రసాదించిన మా నాన్న గురించి సభలో అందరి మాటలు విన్న తర్వాత మా నాన్న గొప్పతనం ఒకప్పుడు నాకు తెలీదని ఈ రోజు మా నాన్న ఎంత గొప్పవాడో అర్థమయ్యిందని మేము ఆయనకు ఋణపడి వుంటామని ద్వానా శాస్త్రి కుమారుడు ద్వాదశి శశికాంత్ అన్నారు. సభకు వచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.



**అంశం: నాయకుడు అసమర్ధుడైతే...**

పేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు. 2025 "వారం వారం కవితల వర్క్ షాప్" 17 కు మొత్తం 25 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 10 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

-సంపాదకులు

-డా॥రావిరంగారావు
9247581825

## వచన కవితలు

### నాయకుడా? ప్రజలా?

నాయకుడు అసమర్ధుడైతే
అది ప్రజల సమర్ధతకే ప్రశ్న...
కన్నీరు తెలిసినవారు
కష్టాలు చూసినవారు
కరుణకి అర్ధం తెలిసినవారు
కాలం చెప్పిన నీతిని నమ్మేవాళ్ళు....
వీళ్ళు కదా నాయకులు...
నేడు
వీధి కొక రున్నారు,
వీళ్ళకి దేశాన్ని అప్పగిస్తే
అసమర్ధతేగా మిగిలేది?
ఈ అసమర్ధతే
నీతిని అవినీతిగా మార్చేస్తుంది
నిజాన్ని అబద్ధంగా చూపిస్తుంది
చట్టం, న్యాయం, పాలన, ప్రజాస్వామ్యం
అన్నీ.... మాయమై
రాజకీయ మొక్కటే మిగిలిపోతుంది...
నాయకుడు అసమర్ధుడైతే....
రావణుడే దేవు డవుతాడు
రాముడు ఓటుకు నోటవుతాడు
కులం గుర్తింపు కార్డుగా
మనిషి మనిషికీ కంచె కడుతుంది...
స్వార్థం అమృతాన్ని కూడా కుళ్ళబెట్టేస్తుంది
చదువును అమ్మకానికి పెడుతుంది
ఆరోగ్యాన్ని అప్పులపాలు చేసేస్తోంది
ఉపాధిని వొద్దని,
అందరినీ బానిసలుగా చేసుకుంటుంది...
అసమర్ధత రాజ్య మేలే
అర్ధాకలి జీవితాల్లో
ప్రతీ వేకువా ఒక అమవాస్యలా చీకటి పూసేస్తుంది...
అపూర్వమైన సంస్కృతి
అద్భుతమైన మేధస్సు
అపారమైన ప్రకృతి
అపురూపమైన రాజ్యాంగం
ఇన్ని గొప్ప సంపదలు ఉన్న మనం
ఓటుకు అమ్ముడుపోని
డబ్బుకు లొంగిపోని
కులానికి కరిగిపోని
స్వార్థానికి బెదిరిపోని....
నాయకుడ్ని కూడా ఒకసారి నమ్మితే
సమర్ధత అనే ఏమిటో తెలుస్తుంది,
నాయకుడంటే ఎవరో....
గుండెకు అర్థమైపోతుంది.

**-శ్రీఅరుణం శ్రీనివాస్**

నాయకుడు అసమర్ధుడైతే ..
నదుల్లో ప్రవహించే నీటిని
మత ఘర్షణల రక్తంతో ఎరుపెక్కిస్తాడు!
గాలిలో ఉండే ప్రాణ వాయువుని
కులాల కంపుతో కలుషితం చేస్తాడు!!.
నాయకుడు అసమర్ధుడైతే ..
పేదోడి గుడిసెకు పెట్టిన మంటతో
పెద్దోడి భవంతిలో దీపం వెలిగిస్తాడు!
నింగికి నేలకు మధ్యనున్న దూరాన్ని
ఆర్థిక అంతరాలుగా మారుస్తాడు!!.
నాయకుడు అసమర్ధుడైతే ..
అక్రమ కేసుల కొరడా ఝుళిపించి
అందరి చేత సలాం కొట్టించుకుంటాడు!
అక్రమాస్తులను పేర్చుకుంటూ పోయి
అప్పుల ఊబిలో అందరినీ ముంచుతాడు!!.
నాయకుడు అసమర్ధుడైతే ..
ఇంటి దొంగలకు కొమ్ము కాసి
ఖజానాను దివాలా తీయిస్తాడు!
ఇరుగుపొరుగుతో కాలు దువ్వి
ఇంటిలోనూ పోరు పెట్టేదాకా వదలడు!!.
నాయకుడు అసమర్ధుడైతే ..
అరచేతిలో వైకుంఠం చూపిస్తూ
అభివృద్ధిని అటకెక్కించేస్తాడు!
పన్నుల మీద పన్నులు వడ్డించి
ప్రజల నడ్డి విరిచి మరీ నవ్వుతుంటాడు!!

**-టి. ధనుంజయ రెడ్డి,**

నాయకుడు అసమర్ధుడైతే
సస్యశ్యామల దేశం పొలంలో
కలుపు మొక్కలు పెరుగుతాయి...
సత్యం ధర్మం త్యాగం అనే
మొక్కలను ఏపుగా పెరగనీయవు,
దేశం మొత్తం ఆక్రమించి
పునాదులతో సహా
మంచిని పెకలించి
మేమే రారాజుల మంటూ
విశ్వరూపం ప్రదర్శిస్తూ పాతుకు పోతాయి ...
ఇదే అద ననుకొని
స్వార్థం దోపిడీ పురుగు ప్రవేశిస్తుంది,
అన్యాయాలకు అక్రమాలకు పాల్పడుతూ
దోపిడీలు చేస్తూ
నకనక లాడే డొక్కలను కూడా
పీలుస్తూ పీక్కు తింటుంది ..

**-సత్యవతి**

నాయకుడు అసమర్ధుడైతే
అవినీతి వేయి పడగల సర్పమై
స్వార్థ విషం విరజిమ్ముతూ
అమానుషత్వపు కోరలు విసిరేస్తూ
ఖజానాని ఆబగా కబళించేస్తుంది ...
నాయకుడు అసమర్ధుడైతే
కులమతాలు ప్రజ్వరిల్లుతూ
రక్తపుటేరుల్ని ప్రవహిస్తూ
విచ్ఛిన్న శక్తుల్ని మింటి కెగేస్తూ
మానవత్వాన్ని మట్టి కరిపిస్తాయి...
నాయకుడు అసమర్ధుడైతే
అలవి కాని ధరల విహారాలతో
దళారీల ఆనంద తాండవ మొకవైపు,
ఆకలి మంటల హాహాకారాలతో
పేద గుండెల ఆవేదనా తాండవ మొకవైపు...
నాయకుడు అసమర్ధుడైతే
అక్రమార్జనలకు కట్టడి లేక
హుండీల బరువు పెరిగిపోతూ
అన్యాయాల ముట్టడే లేక
సత్యం, ధర్మం ఆనవాళ్లే తరిగిపోతాయి...
నాయకుడు అసమర్ధుడైతే
విదేశీ శక్తులు పుంజుకుంటూ
దేశ సమగ్రతకు సవాళ్లిసురుతూ
అస్తిత్వ కుదుళ్లను తొలిచేస్తూ
భారతీయ వృక్ష మొదళ్లనే పెళ్ళగిస్తాయి...

**- మేడిశెట్టి సుభద్రా కృష్ణ**

### జాతికి మనుగడ

సత్యం కోసం చేసే యుద్ధంలో
ముందుండి నడిపే నాయకుడు
యోధుల్లో పోరాట స్ఫూర్తిని రగిలిస్తూ.
అన్యాయం పై ఎక్కుపెట్టిన ప్రతి బాణానికి
దిశా నిర్దేశం చేస్తూ
బియ్యంలో రాళ్ళలా కోవర్టులను ఏరేస్తూ
గెలుపు నమ్మకం కల్గిస్తూ
వారి వెన్నంటి ఉంటే వారు
గెలుపు కోసం మెరుపు రవ్వలై తలపడతారు...
పోరాట మన్నాక
అభిమన్యుడి మరణాలూ ఉంటాయి.
మహా వీరుల బలిదానాలూ ఉంటాయి.
వాటికి కుంగి పోకుండా
మనో బలంతో తలపడితేనే
గెలుపు వరిస్తుంది.
అలా కాకుండా?
ఆ నాయకుడు అసమర్ధుడైతే
వలలో పడ్డ చేపల్లాగా
శత్రువు వ్యూహాలకు
యోధులు దొరికి పోతారు.
ఏమి జరిగిందో తెలుసుకునే లోపలే
నష్టం జరిగి పోతుంది...
కపటం ముందు
ధర్మం తల వంచాల్సివస్తుంది...
యుద్ధంలో గెలవడం ఎలానో
పరిపాలన లోనూ గెలవడం ముఖ్యం..
ప్రజా పాలనలో
అసమర్ధులు నాయకత్వం వహిస్తే ?.
జనంలో అరాచక వాదం ప్రబలి
అధికారుల్లో అలసత్వం పెరిగి
రక్షక వర్గంలో క్రూరత్వం పెంపొంది
మంత్రుల్లో అహంకారం ఏర్పడి
పని వారిలో సోమరితనం ఎక్కువై
జాతి నిర్వీర్యం అయిపోతుంది..
చైనా రాకెట్ లా పైపైకి దూసుకెళుతున్నా,
రష్యా ముక్కలు చెక్కలై పరుగులో వెనుకబడ్డా,
అమెరికా ఉవ్వెత్తున ఎదిగి
ప్రపంచాన్ని శాసిస్తున్నా,
ఆసియా అంతర్యుద్ధాలతో
సతమతమవుతున్నా,
అప్పటి తరం
నాయకుల సిద్ధాంతాల వలననే కదా..
ఏ జనపదాని కయినా
ప్రజా నాయకుల సమర్థత పైనే
జాతికి మనుగడ..

**- శ్రీనివాస శాస్త్రి**

### మినీ కవితలు

**భజన**

అట్టడుగు
ఆర్తనాదాలు
వినపడలేదు అతనికి.....
భజనపరుల పల్లకిలో
ఊరేగుతున్నాడుగా?

**విభజన**

అతడు
మనుషుల మధ్య
మతాల గోడలు కట్టాడు.
కలిసి పోతే
కుర్చీ కదిలిపోతుంది
అనే భయంతో!!!!!

**తాకట్టు**

దేశాన్ని
తాకట్టు
పెడుతున్నాడు అతడు.
ఓట్లను
కొన్న ఖర్చు
రాబట్టుకోవాలిగా!

**భవిష్యత్తు**

అతడికి
భవిష్యత్తు
కనబడడం లేదు..
వాళ్ల నాయకుడి
కళ్ళజోడు
పెట్టుకున్నాడుగా!!!

**నిదుర-మత్తు**

సింహాలు
చెల్లాచెదురయ్యాయి.
నక్కల దాడిలో...
నడిపించే నాయకుడు
మత్తుగా
నిదురోతున్నాడుగా!!!

**మద్దతు-ధర**

బడిలో ఉండాల్సిన
బాల్యం.
మడిలో ఉండాల్సిన
రైతన్న.
ఇద్దరికి
మద్దతు ధర దొరికింది
నాయకుడి ఊరేగింపులో...

**-ఎనికేపల్లి శివకుమార్**

### కన్నీళ్ళ కాపురమే..

నాయకుడు అసమర్థుడు అయితే...
బురద పాములు కూడా బుసకొడతాయి..!
అధర్మానికి రెక్కలు వస్తాయి.
అవినీతికి కొమ్ములొస్తాయి...
కష్టసుఖాలగురించి
పరామర్శించే నాథుడే లేక
అనాథలైపోతారు ప్రజలు..!!.
పేరుకు ప్రజాస్వామ్యమే అయినా
బలం బలగం ఉన్నోడిదే మాటగా
ధనం ఉన్నోడిదే శాసనంగా మారి
పేదల బతుకులు మాడిపోతాయి
పెత్తందారుల పొయిలో పుల్లలుగా..!!.
విజృంభిస్తాయి కులమతాల ముసలక్కాలు
అన్నదమ్ముల అనుబంధాలలో
చిచ్చు పెడుతూ
ఎటు చూసినా ఎర్రగా పారే
దుఃఖపు నదులే..!!.
ఆలోచనే చేయలేని
కాచుకొని కాపాడి రక్షణ కల్పించలేని
అసమర్థుడైన నాయకునికి పట్టం కడితే..
జనానికి కన్నీళ్ళకాపురమే!!

**-ఎస్. ముంతాజ్ బేగం**

ఆచి తూచి మనము
అడుగెయ్యకా పోతే..
అనువించక తప్పదన్న
అసమర్ధ నాయకుని
ఆగడాలు తప్పవన్నా.

**-మేడిశెట్టి యోగేశ్వరరావు**

## గేయం

### గురివింద చందము.

ఎదుటి వాడిమీద
బురద జల్లుతాడు..
తమవారి తప్పులకు
తైలంబు రాస్తాడు......
మంచి వాడిని కూడ
మాయలోడంటాడు.
చవట దద్దమ్మలను
దైవాంశు లంటాడు..
ప్రజల మేలు కొరకు
తన పలుకు లంటాడు..
అవినీతిపరులతో
తను కులుకుతుంటాడు..
వెక్కిరింపుల కొన్ని
వెటకారములు కొన్ని...
వేయి పడగల పాము
విషపు నవ్వుల వాడు...
అవినీతి అంతమే
తన ధ్యేయ మంటాడు..
చేయి తడపకపోతే
తన్ని తరిమేస్తాడు
నవ్యశకమున కింక
తను నాంది అంటాడు..
గుట్టుగా తన వాళ్ల
జట్టు చేరతాడు...
పలుకు పంచదార
నొసట కంటి ధార....
పూతనా లేహ్యంబు
పూసుకున్నా వళ్లు...
పనికి రాని రాళ్లు
పసిడి పసిడంటాడు
మేలిమి రాళ్లను
మురికి మురికంటాడు..
పచ్చి నిజమును కూడ
పాతరేస్తుంటాడు...
పనికి రాని మాట
గీత బోధంటాడు..
గురివింద గింజ
మా కుల దైవమంటాడు..
అసమర్ధ నాయకుడు
ఇటులనే ఉంటాడు..

*పుస్తక సమీక్ష*

# వర్తమాన కాల వ్యాఖ్యానం-శూన్యం కవితా సంకలనం

## (శూన్యం కవితా సంకలనం పై సమీక్ష వ్యాసం)







ప్రతులకు:
ఫిజిక్స్ అరుణ్‌కుమార్
సెల్:9394749536

తెలుగు నాట వెలువడుతున్న దినపత్రికలన్నీ సాహిత్య పూటలు నిర్వహిస్తున్నాయి. ఏదో ఒక దినపత్రికలో ప్రతి సోమవారం తప్పక కనిపించే కవి ఫిజిక్స్ అరుణ్ కుమార్. అసలు పేరు పోతుల అరుణ్ కుమార్. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి భౌతిక శాస్త్రంలో స్నాతకోత్తర పట్టా పొందాడు. గణిత, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా జీవితం ప్రారంభించి, ప్రస్తుతం ప్రైవేట్ రంగంలో భౌతిక శాస్త్రాచార్యులుగా పనిచేస్తున్నారు.

సాహిత్యం మీద మక్కువతో రవీంద్రనాథ్ ఠాగూర్, శ్రీ శ్రీ, కాళోజి, సిరివెన్నెల,జనజ్వాల తదితర కవుల రచయితల రచనల నుంచి ప్రేరణ పొందినాడు. ప్రముఖుల స్వీయ జీవిత చరిత్రలు చదివి స్ఫూర్తి పొందాడు. గత ఇరవై సంవత్సరాలుగా రాస్తూ రాస్తూ మంచి కవిగా రూపుదిద్దుకున్న అరుణ్ కుమార్ 2025 ఫిబ్రవరిలో శూన్యం కవితా సంకలనం గా తన మొదటి పుస్తకం ముద్రించుకున్నారు.

శూన్యం కవితా సంకలనంలో మొత్తం 58 కవితలు ఉన్నాయి. అన్ని కవితలు ప్రజాక్షేత్రంలో పేరెన్నికగన్న ప్రముఖ పత్రికలలో అచ్చైనవే. కవితలన్నీ 2024 వరకు వివిధ సందర్భాలలో సమాజంలో జరిగిన సంఘటనలకు ప్రతిస్పందించి రాసినవే ఎక్కువ.

అరుణ్ కుమార్ కవితలలో గౌతమ బుద్ధుడు, గాంధీజీ, అంబేద్కర్ ,వివేకానందుడు, విశ్వకవి రవీంద్రుడు, భగత్ సింగ్, కలాం లాంటి మహనీయులు సందర్భానుసారంగా కనబడతారు. తను లెఫ్టా రైటా అనే విషయం తెలియకుండా చాలా జాగ్రత్తగా రాసాడు. ఆ మహనీయుల బోధనలు, ఆదర్శ జీవితం తన కవితలతో పాఠకుల హృదయాలలోకి పంపే ప్రయత్నం చేసాడు.

వరుణ్ కుమార్ తన గురించి' **"ఆకలి ఆవేదనపు శూన్యాన్ని/అక్షర ఆలోచనపు అనంతాన్ని/కొన్ని దశాబ్దాలుగా ఆవాహనం/చేసుకున్నవాణ్ణి...."** అని తన సాపేక్షతా సిద్ధాంతాన్ని ప్రకటిస్తాడు.

అరుణ్ రాసిన కవితా పాదాలలో కొన్ని వాక్యాలు తూటాలా మన మనోఫలకాలపై దూసుకొస్తాయి. చాలా సాధారణ వాక్యాలా **"ఏ కులము నీదంటే/నా కలం నవ్వింది..!"**(90) అంటాడు ప్రస్తుత సమాజంలో కులం ప్రభావం ఎంత ఉందో సూటిగా చెప్తాడు.

మరొకచోట **"సత్యాగ్రహం రావాలి/ప్రేమ వనంలో నవభారతవు/లౌకికవాదం వికసించాలి"(77)** ఇప్పుడు దేశంలో మత ప్రాతిపదికన ప్రజలు నిలువునా చీలిపోయినారు. విద్వేషం పెచ్చరిల్లుతుంది. దానిని ఆపడానికి మళ్లీ గాంధీ గారి సత్యాగ్రహ ఆయుధం కావాలంటాడు.

బాల్యాన్ని చిదిమేస్తున్న విద్యావిధానాన్ని, కుటుంబాలను అప్పుల పాలు చేస్తున్న కార్పోరేటికరణాన్ని నిరసిస్తూ" **చదువు 'కొనలేక'/ చదువు 'కొని' రాయలేక/తనువుల్ని వదిలేస్తున్న/ భావి భారత పౌరుల్ని"**(74) చూసిన కవి గుండెల్ని బాధుకుంటాడు.

కాలుష్య భూతం భూమిని పట్టిపీడిస్తున్నది. దాంట్లో ప్లాస్టిక్ ప్రధాన కారణమని అంటాడు. మనిషి విలాసాలకు కులాసాలకు అలవాటు పడ్డాడు. భూమిని సర్వనాశనం చేస్తున్నాడంటూ" **కడకి కన్నతల్లి రొమ్ము పాలు సైతం/ కలుషితమవుతుంటే/కథ ఇంకా అర్థం కాదేంటి మనకు...!"**(62) అని ఆశ్చర్యంతో ప్రశ్నిస్తాడు.

రాజకీయాలను ప్రశ్నించకుండా రాయని కవి బహుశా ఉండరేమో. అంతే సహజంగా నాయకుల సహజ వ్యవ్హారం. రెండు నాలుకల ధోరణి. ఆ విషయాన్ని అంతే వ్యంగ్యంగా ఇలా అంటాడు" వాని బహిర్గతం... అంతర్గతం.../రెండు ఎప్పటికీ రాజకీయ/అయస్కాంతపు విభిన్న ధృవాలే"(60) రాజకీయ నాయకుల చేసే పనులకు చెప్పే మాటలకు పొంతనుండదని భౌతిక శాస్త్రం ఆదారంగా పోలుస్తాడు.

ప్రతిరోజు మనం రాజ్యాంగం గురించిన మాట వింటున్నాం. చర్చ కూడా చేస్తున్నాం. రాజ్యాంగ మీద దాడి జరుగుతుంది. దానిలో ఉన్న అనేక విషయాలు భిన్నాభిప్రాయాలకు తావిస్తున్నదని, భిన్నత్వంలో ఏకత్వం చెప్తుంది అంటాడు**"మతసామరస్యమే/మానవత్వపు పరిమళమై/మన అంబేద్కర్ విరచించిన/ రాజ్యాంగపు గుండె శబ్ద మై/ప్రతిధ్వనిస్తున్న మాట నిజమే కదా"**(27) అని అంబేద్కర్ గొప్పతనాన్ని కవిత రూపంలో చెప్తాడు.

లింగ వివక్ష కూడా సమాజంలో చాలా దారుణాలకు దారితీస్తుందని. అది ఆడవారిని మానసిక శారీరకంగా ఎన్నో బాధలకు గురిచేస్తుందంటాడు. ఆడవారు దానిని ధైర్యంగా ఎదిరించాలని స్థైర్యాన్ని నూరిపోస్తాడిలా**"కేరింగ్ లేని ఈ సమాజంలో/ట్రోలింగ్ తో నిత్య/ యుద్ధం చేస్తుంది"(13)**ఎక్కడ ఏ ప్రశ్న తలెత్తిన సామాజిక మాధ్యమాలలో అసభ్య పదజాలంతో ఎంత ట్రోలింగ్ జరుగుతుందో మనందరికీ తెలుసు కదా!.

అరుణ్ కుమారులో తాత్విక చింతన కోణం కూడా ఉంది. తల పండిన పెద్దవాడిగా, చాలా ఉన్నతమైన ప్రశ్న ఇలా వేస్తాడు" **నలుగురు మోస్తున్న పాడెపై/నిశ్శబ్దపు నిశ్చితార్థపు శాశ్వత/నిద్ర లో నువ్వు స్వప్నిస్తున్నప్పుడు/కొన్ని చైతన్యపు నడకల/ అలజడుల తంత్రులైన/నిన్ను కదిలించాయా..?** (15)మనిషి బ్రతికున్నప్పుడు స్పందించడం లేదుకదా అంటాడు.

ఫిజిక్స్ అరుణ్ కుమార్ కవిత్వ సంపుటిలో ఉన్న కవితలు వస్తు పరంగా కొత్తగా ఉన్నాయి. కానీ శిల్పం విషయంలో ఇంకా పరణతి చెందాలి. క్లుప్తత శిల్పానికి అందాన్ని చేకూరుస్తుంది. కవిత్వం లో చిక్కదనం రావాలంటే కొత్త పదబంధాలు రాయాలి. పద చిత్రాలను గీయాలి. ప్రాంతీయ భాష యాసలను అక్కడక్కడ ఒడుపుగా ఉపయోగించాలి. కొన్ని కవితలలో వాక్యాలు చాలా పొడిపొడిగా ఉన్నవి. గద్యాన్ని విరచి కవితల్లా రాసినట్టు అనిపిస్తుంది. అలా జరిగినప్పుడు కవితలలో బిగి సడులుతుంది. పాఠకులు కవితలను చదివేటప్పుడు దాటవేసే ధోరణిలోకి తీసుకుపోతుంది. కవి పునరుక్తి పదాలు, పాదాలు రాయకూడదు. కవికి సొంత శైలి రావాలంటే అనుకరణ అనుసరణ వాక్యాలు రాయకపోవడమే మంచిది. కవితలలో బౌద్ధిక జీవితం ఉన్నట్టుగానే భౌతిక శాస్త్రం కూడా ఉంటుంది.

భౌతిక శాస్త్రం నుంచి అలంకార పరిభాషలోకి మార్చి ఉపమా రూపక మొదలగు అలంకారాలతో చెబితే అద్భుతంగా ఉంటుంది.

పై అంశాలు కవులు దృష్టిలో పెట్టుకుంటే అద్భుతమైన కవిత్వం సృష్టిస్తారు.

అరుణ్ కుమార్ కు మొదటి పుస్తకమే అయిన అక్కడక్కడ దృష్టికి వచ్చిన కొన్ని విషయాలను పంచుకోవడం వల్ల బంగారానికి పుటంపెట్టినట్టుగా భావిస్తాను.

శూన్యం కవితా సంకలనం బహుళ ప్రజాదరణ పొందాలని కోరుకుంటూ, తన మొదటి కవితా సంకలనం ప్రకటించినందుకు ఫిజిక్స్ అరుణ్ కుమార్ కు శుభాభినందనలు.



**-డా.ఎడ్ల కల్లేశ్**
9866765126

# అది పరిణామానికి దిక్సూచి

ఆ రెండు కొండల మధ్య
ఏరు ఉరువళ్ళు తొక్కుతూ ప్రవహిస్తూ వుంది
ఆ కొండలు నిండా పచ్చికతో జీవకళ
ఆ నదీమ తల్లి కొండకు పురుడుపోస్తూ వుంది
నదీ జలాలు సమస్త జీవరాసులకు ప్రాణదాతలు
అడవి అందాలన్ని
ఏటి గలగలనుండే జనిస్తున్నాయి
సరిహద్దులన్నీ సంక్షోభంలో వున్నాయి
ఉగ్రవాదం ఉన్మాదంలో వుంది
ఆ నియంత విద్యాలయంపై
ఉక్కుపాదం మోపాడు
జ్ఞానంపై దాడి
జ్ఞానం జీవన సర్వస్వం
జ్ఞానం దేశాలకు ఊపిరి
జ్ఞానం మానవాభ్యుదయానికి జీవనాడీ
అయినా!
అజ్ఞానానికి ద్వారాలు తెరుస్తున్నారు
మౌఢ్యానికి ధనరాసులు కుమ్మరిస్తున్నారు
అక్షరానికి నిరాకరణ
పేరుకు తెల్ల భవనం
చేస్తున్నది నల్ల చట్టాలు
ఐదవ వంతు వారు
తొంబై ఐదు మీద పెత్తనం
దోచుకునేవాడికి భుజకీర్తులు
పేదవాడి ఆకలికి దొంగతనం
ముద్ర
రండి! రండి! రండి!
"మా భూములన్ని మీకిస్తం"
"తులమో ఫలమో మాకివ్వండి"
అని కార్పోరేట్లకు ప్రభువుల పిలుపు
ఇక్కడ పుట్టిన వాడి గుడిసెపై
బుల్డోజర్ల దాడి
"కాలువ గట్టు కూడా నీది కాదు
సముద్రం ఒడ్డు అంతా అమ్మివేశాం
చేపలు పట్టే కడలిని కొన్నవాడికి ఇవ్వండి"
అని పాలకుల శాసనం
"అందరూ కూలి వాళ్ళే
కొనుగోలుదారుడిదే గుత్తాధిపత్యం"
అంటున్నారు పాలకులు
"నిజమే! చదివి, చదివి వేసారి పోయాము
డిగ్రీలు మాకు
ఉద్యోగాలు మీ అయిన వారికి
నిరుద్యోగం మాకిచ్చే కానుక!"
అంటున్నారు యువత.
"పేదరికాన్ని అనుభవించండి"
ఇది కర్మ భూమి
ఏది రాసి పెట్టి ఉంటే అదే జరుగుతుంది
నుదిటి మీద రాతలే నెరవేరతాయి
రాజ్యాంగంలోని రాతలు తాత్కాలికమే"
అంటున్నారు పాలకులు
అదిగో / వేదాంతులు
"రాశీ ఫలాలు చెబుతున్నారు
అన్ని పైవాడే రాస్తాడు
ఇక్కడ నిర్ణయాలు ఏమి లేవు
యోగులు, స్వాములు
బైరాగులు, రుద్రాక్షిదారులు
మీ భవిష్యత్తుకు
బంగారు వాక్యాలు చెబుతున్నారు
అవి నక్షత్రాలు లెక్కెసి చెబుతారు
ఇక అక్షరాలు నేర్చుకోనక్కరలేదు"
అని జ్యోతిష్కుల వాక్కులు
అదిగో ఆ ఎద్దు నడిచె వెళుతుంది
దాన్ని పూజిస్తే చాలు
పసుపు పూసి స్తుతిస్తే
జీవితం గడిచిపోతుంది
అంతేకాదు ఆ వేప చెట్టుకు
రెండు పసుపు బొట్టులు పెడితే చాలు
ఎందుకు బిఏలు, ఎం.ఏలు చదవడం
ఏదో ఒక శిలకో అంకితం అయితేచాలు
జీవితం కైలాసానికి కూడా వెళుతుంది."
అని బోధిస్తున్నారు స్వాములు
లక్షలకు లక్షలకు దేవాలయాలు పెరుగుతున్నాయి
విద్యాలయాలు తరుగుతున్నాయి
పేదలకు బియ్యం ఇవ్వడానికి
వాహనాలు ఎందుకు?
దేవుళ్ళను వూరేగించడానికి
రథాలు చేయించండి!
అందరికి డైరెక్ట్‌గా ముక్తి లభిస్తుంది
విశ్వవిద్యాలయ అధ్యాపకులారా!
శాస్త్రజ్ఞానం ఎందుకు?
దేవుళ్ళ కథలు చెప్పండి!
వారి భార్యల గురించి
పిల్లల గురించి బోధించండి!
"మేము, మా పిల్లలం పాలకులం అవుతాం!
అని రాసిపెట్టి వుంది
మా పుట్టుక మరణం
రాజ్యాధికారం
మీరు దరిద్రులుగా బ్రతకడం
రాసి పెట్టి వుంది"
ఇది పాలకుల మహోపన్యాసం
సంగీతాజ్ఞులారా!
మీరెందుకు ప్రకృతిమీద
మనుషుల మీద పాటలు కడతారు
సంగీత స్వరాలన్నీ
దేవుళ్ళ కీర్తనలకు ఉపయుక్తం చేయండి!
స్వర్గాన్ని క్రిందకి దించండి!
ఈ లోకాన్ని మరిపించండి!
రంభ, మేనకలతో
నృత్యాలు చేయించండి!
ప్రజలను సురాపాన మత్తులను చేయండి
ఆధునికమంతా
ప్రాచీనం చేయడమే మీ కర్తవ్యం
ఇది నేటి ప్రవచనం
అయినా!
కొత్త ఆలోచనలు పుడుతూనే వున్నాయి
గుండె డప్పులు మోగుతూనే వున్నాయి
ఎర్ర జెండాలు, నీలి జెండాలు
ఎగురుతూనే వున్నాయి
మార్పు చారిత్రక కర్తవ్యం
ఆ అంబేద్కరుడు రోజు
బోధిస్తున్నాడు, సమీకరిస్తున్నాడు
ఉద్యమిస్తున్నాడు
అది ప్రవహించే జ్ఞానం
అది మార్పుకు సంకేతం
అది పరిణామానికి దిక్సూచి
అది పునర్నిర్మాణానికి సిద్ధాంతం
అది రాజ్యాంగ భాషణ
అదే నిజమైన భవష్యత్తుకు బాట
ఆ బాటలో నడుద్దాం ఆంధ్రప్రదేశ్.



**-డా॥ కత్తి పద్మారావు**
9849741695

## మాతృభాషకు తందాన తాన

మాతృభాషకు వందనం తందాన తాన
మధుర భాషకు వందనం తందాన తాన
మాతృభాషకు వందనం తందాన తాన
మధుర భాషకు వందనం తందాన తాన.
తెలుగునుడికి వందనం తందాన తాన
తెలుగు బడికి వందనం తందాన తాన
తెలుగు నుడికి వందనం తందాన తాన
తెలుగు బడికి వందనం తందాన తాన.
చక్కని తెలుగు అక్కరాలకు వందనం తందాన తాన
అక్కజపు యాభదారు అక్షరాలకు తందాన తాన .
ఆవు అంబా అంబా అన్నందుకు వందనం తందాన దాన
కాకి కావు కావు అన్నందుకు తందాన దాన
తెలుగువారు అమ్మను మమ్మీ అన్నందుకు తందాన దాన
పిల్లలు డాడీ డాలరూ అన్నందుకు తందాన తాన
ఆంగ్లభాష వున్నందుకు తందాన దాన
అమ్మ భాష లేనందుకు తందాన తాన
వీపుకు బండెడు పుస్తకాలకు తందాన తాన
మోపెడు ఫీజులు కట్టడానికి తందాన తాన .
మాతృభాష నిర్లక్ష్యానికి తందాన తాన
ఆంగ్ల భాష ఆకర్షణకు తందాన తాన
మన జనానికి పట్టనందుకు తందాన తాన
పాలక జనానికి గిట్టనందుకు తందాన తాన
చదువుల దోపిడీ రాజ్యానికి తందాన తాన
ఇంగ్లీషు భాషా వ్యామోహానికి తందాన తాన
పరుల భాషకు పట్టం కట్టడం తందాన తాన
మనల భాషకు పాడి కట్టడం తందానతాన
ఎన్ని వాగినా ఎన్ని మ్రోగినా
ఎన్ని రాసినా ఎన్ని మోసినా
ఎన్ని వాగినా ఎన్ని మ్రోగినా
ఎన్ని రాసినా ఎన్ని మోసినా
చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా
తందానతాన
కళ్ళుండి చూడలేని కబోదులకు
తందాన తాన
మా వేదనకు మా వాదనకు తందాన తాన
మా రాతలకు మా చేతలకు తందాన తాన
మాతృభాషకు వందనం తందాన తాన
మధుర భాషకు వందనం తందాన తాన
మాతృ భాషకు వందనం తందాన తాన
మధుర భాషకు వందనం తందాన తాన



**-రాఘవ మాస్టారు కేదారీ**
*6362973252*

## విమాన విషాదం



*విమాన ప్రయాణం*
*గాలిలో తేలిపోవడం*
*ఆనందమే*
*గమ్యం చేరే దాకా*
*గమనం గగనమే !*
*వీడ్కోలు స్వాగతాల*
*ఆనంద ఆలాపనల హేల*
*గమ్యం గగనాల మధ్య*
*వారధి*
*విహంగ యంత్రం సారధి*
*యంత్రాలకు*
*సాంకేతిక లోపం*
*పుట్టుకతోనే యమ శాపం!*
*మేడే.. మేడే .. మేడే..*
*నో పవర్ .నో ఫ్యూయల్.నో థ్రస్ట్..*
*అది యంత్ర సంకేతమే.. సందేశమే..*
*అందకపోతే రక్షణ సందేహమే!*
*అది యుద్ధంలో ఊడిపోయే*
*దశరథుని రథచక్రాన్ని ఆపినట్లు*
*ఆదుకున్న కైకేయి వామహస్తం*
*తోడ్పాటు అందక*
*విమానం మేడ పై కూలె*
*అమాయక ప్రాణాలు మంటల్లో మాడె!*
*(గుజరాత్ విమాన దుర్ఘటన*
*సందర్భంగా)*



**- పట్లోళ్ళ బక్కారెడ్డి**
*9705315250*

## అరేబియా సముద్రుడు



ఊరు పేరు గుర్తొస్తే
ఒక కవి పేరు మదిలో మెదలాలి
కవి పేరు యాదికొస్తే
ఊరు పేరు మతికి రావాలి
ఊరు లేనిదే కవిలేడు
ఆ కవి లేనిదే ఊరుకు పేరే లేదు
కవి పుట్టకపోతే
ఆ ఊరు గోస చెప్పనలవి కాదు.
అందుకే ఏ ఊరైనా సరే
ఒక కవిని కనాలి
ఆ ఊరంతా కలిసి కవిని బతికించుకోవాలి.
అణువంత మనిషి
మహానగరమంత విస్తరించి
మహోన్నతంగా కనిపించాలి.
అందరూ
మనుషులుగానే కనిపిస్తారు
హృదయం ఉన్న మనిషి మాత్రమే
సమున్నతంగా దర్శనమిస్తాడు.
బొంబాయి పేరు విన్నప్పుడు
కొందరికి ఎలిఫెంటా గుహలు
మహాలక్ష్మి ఆలయం
హాజీ అలీ దర్గా గుర్తొస్తాయి
మరి కొందరికి సినీ యాక్టర్స్
క్రికెట్ స్టార్స్, ముకేశ్ అంబానీ,
పొలిటిషియన్స్ గుర్తొస్తారు.
నాకు మాత్రం
అరేబియా సముద్రం గుర్తొస్తుంది
ఆ సముద్రం లాంటి
దేవానంద్ నాగెల్ల గుర్తొస్తాడు .
ఎక్కడి సిరిసిల్ల జిల్లాలోని
ముస్తాబాద్
పక్కన కొండాపూర్
ఎక్కడి ముంబాయి మహానగరం
ఎక్కడినుండి ఎక్కడికి ప్రయాణం.
బతుకు తెరువు కోసం
కట్టుబట్టలతో వెళ్లిన
ఈ బగర్ టికెట్ బాలుడు
దినసరి కూలీగా కడుపు నింపుకున్న
రోజులు చాలానే ఉన్నాయి
ఊరు గాని ఊరిలో
ఎలా ఊపిరి పీల్చుకున్నాడో
భాష గాని భాషలో
దుఃఖాన్ని ఎలా దిగమింగాడో.
దేవానంద్ భాష పేరు కరుణ
అది విశ్వజనీయమైన భాష
అతని దృష్టి మానవత
అది లోక నయన భాష
అందుకే ఈ దేవానందుడు
మన అందరి వాడైనాడు .
పుట్టిన ఊరికి సేవ చేస్తాడు
ఆపద ఉందంటే ఆదుకుంటాడు
తనను నమ్ముకున్నోళ్లకు అండగా ఉంటాడు.
ఉన్నోళ్లను లేనోళ్లను
కొండాపూర్ పల్లెను ముంబై నగరాన్ని
ఒకే రకంగా చూస్తాడు.
ప్రతినిత్యం
కంకర సిమెంటు మధ్య నివసిస్తూ
బహుళ అంతస్తులను నిర్మిస్తాడు
ఆటవిడుపుగా కవిత్వాన్నీ పలవరిస్తాడు.
మీరు ఎప్పుడైనా ముంబై వెళితే
దేవానంద్ అన్నను కలవండి
ముంబైని నల్లకుక్క పిల్లను చేసి
మన వెనక పరుగులు తీయిస్తాడు
ఈ కొండాపూర్ పిల్లగాడు
కొండంత ఆనందాన్ని నింపి
మనల్ని తడికళ్లతో
సాగనంపుతాడు.

(జూన్ 19 ముంబై కవి, దేవానంద్ నాగెల్ల పుట్టినరోజు సందర్భంగా..)



**-మౌనశ్రీ మల్లిక్**
8919338546



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతివారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

## పిడికెడు పిట్ట

పారుతున్న నీరు నేలపై
కడలిలో కదలని అలలై.
కడలి అంచులను తాకి.
ముసి ముసిగా మురిసిపోయే కెరటాలు .
విహంగ వీక్షణములో.
కడలి అలలు దాటి.
ఆకలిని తీర్చుటలో
కాలముతోపోటీపడి
చూపులను సారించిన
డేగ కన్ను విశ్వ నేత్రమై
పాతాళం లో దాగివున్న.
ప్రాణిని చేజిక్కించుకొను.
చిట్టి బొజ్జ నింపుటకై
వేల మైళ్ళు దాటేచుటలో.
రెక్కల ఈకలను విదిలించిన.
పక్షులెన్నో
పక్షిని చూసి నేర్చుకోరా మనిషి.
ప్రకృతిని చూసి చిగురించుకో మనిషి
చూచే చూపుకు విశ్వమంతా సుందరమే
లోలోన దాగున్న జడత్వ రస జటరాగ్ని లెన్నో
పైపైన సున్నితపు
భాషా భూషణలలో దాగిన వ్యామోహాలెన్నెన్నో
జతగట్టిన గమనములో చిరాకు పరాకులెన్నో
చీదరింపులెన్నో మోహరింపులెన్నో
ఆధారం లేని విహంగంలో
పిడికెడు పిట్ట ధీరత్వాన్ని మదినిండ నిలుపుకుని
మసులుకో మానవుడ

-యరకల యాదయ్య
9866468979.

## వాన-"నాని" దోస్తాన!!

"నాని" వానలో నాని నాని పోతున్నాడు !
పైన డ్రెస్సు వాన మబ్బులో ముంచినట్లే !
పిడుగు పడ్డట్టు తుమ్ములు !
ముక్కు నుండి జల ధారలు !
అమ్మ నాన్నల తిట్ల వాన ఉరుములు ఉరుములు
అయినా వాన -- నాని కలిసి ఆడుకుంటునే ఉంటారు!
నాని ముఖంలో ఖుషీ మెరుపులు మెరుపులు

- కందాళై రాఘవాచార్య
8790593638

## దినకర

ఉదయాద్రులపై చీకటి తెర
మెల్లగా తొలగి వెలుగుతున్నది పొలిమేర
పుడమి తల్లికి సిందూరమైన శుభకర
కరములెత్తి మ్రొక్కెద దినకర!.
నభోమండలమున నీ నడకలు
భూమండలంలో మాఉరుకులుపరుగులు
అలుపెరుగని ప్రత్యక్ష దైవమా
అర్ఘ్య మోసగి సేవింతు గైకొనుమా!.
అనంత వినీలాకాశంలో
ఆదిత్యుని అమృత రశ్ములు
అనంత జీవకోటి ప్రాణ రక్షులు
ఆకలి తీర్చే అక్షయ పళ్ళెరములు!.
ఎండలు మండుతున్నాయని
ఎంతగా మిడికినా
ఎద లోయల తడులు ఇగిరితేనే
ఎద చిగురులకు తొలకరులు!.
చందమామకు నీ వెలుగుల
మేకపే జలతారు వెన్నెలలు
చరాచర జగత్తుకు నీ వెలుగుల
వేకపే తెరుచు తూర్పు వాకిళ్ళు!.
నీ చుట్టు భ్రమణ పరిభ్రమణాలు
మా జీవుల జీవన యానాలు
నీ వెలుగునీడల పగలు రాత్రులు
మా ప్రాణుల ప్రాయాల కొలమానాలు!

-పట్లొళ్ళ బక్కారెడ్డి
9705315250

## కూలిన విహంగం

ఆశలను ఆశయాలను
కడుపులో దాచుకొని,
భద్రంగాగమ్యం చేర్చే రెక్కలవిహంగం..
ఏ జబ్బు చేసిందో!
ఏ దిష్టి తగిలిందో!!
లేవలేక దబ్బున కూలబడ్డది
క్షణాల్లో బతుకులు బూడిదలు..
ఊహకందని ప్రమాదంలో..
సుశిక్షిత పైలెట్లు నిస్సహాయులే..!
ఆత్మీయ బంధాలను
కలవకుండానే..
ఏ లోకాలకో
ఎగిరిపోయిన ఆత్మలు..
ఎక్కడెక్కడి బిడ్డలో తల్లులో తండ్రులో..
దురదృష్టంలోమరో దురదృష్టం..
ఆకలి తీరని మిత్తి
తినేసింది
తింటున్న వైద్య విద్యార్థులను..
మరెందరినో ఆత్రంగా మింగేసింది
ఇది కాలచరిత్రలో
మసిబారిన మరోపేజీ చెరపలేము చింపలేము

- గడ్డం సులోచన
7702891559.

## మానవా !

పశ్చిక బయల్లన్ని ప్లాస్టిక్
దిబ్బలు చేసి
కమ్మని పండ్లు కాస్త కార్బైడ్ కాయలు చేసి
సుమాల సుగందాలు అత్తరు బుడ్డిలోనే ఆపి
పక్షుల కిలకిల రావాలు పాటకు ముందు
నేపథ్య సంగీతానికే పరిమితం చేసి
ప్రగతికి మెట్లు కట్టే తొందరలో
ప్రకృతి పునాదులు కదిలించావు.
సువాసన లేని సుమాలు
రుచి లేని పండ్లు ధాన్యాలు
మానవత్వం లేని మనుషులు
కాలంతో సంబంధం లేని వర్షాలు
జీవం లేని జీవితాల మధ్య
జీవవైవిధ్యం జీవుడికి నైవేద్యం
రెండూ కరువే
ఈగో నష్టం పెరిగిపోతుంది
ఈకో సిస్టం దెబ్బ తింటోంది
ప్రగతి చెట్టుపైకి పాకుతూ ఎక్కిన
ఓ మహానుభావా ఓ మానవా....
కూర్చున్న కొమ్మనే నరుక్కునే
పిచ్చి అలవాటు ఇకనైనా మానవా..

-ఆదిత్య కైరం కొండ
8790771348

## పవనరథం

ఒక్కటొక్క మెట్టు ఎక్కి కూర్చుంటివి
చంద్రమండలమ్ము చేరితీవు
ఎక్కిన పవనరథ రెక్కలెట్లిరిగెరా
కనుము వినుమురోరి కందుకూరి.
టీకు టాకు తోటి టేకాపు అవుతుంటె
గాలిమోటరెట్ల నేలకూలె
బోరుబోరునేడ్చె బోయింగు పైటురా
కనుము వినుమురోరి కందుకూరి

-కందుకూరిశ్రీరాములు
సీనియర్ లెక్చరర్
తపస్య డిగ్రీ కాలేజ్ సికింద్రాబాద్

## అగ్నిపర్వతం!

అందాల సముద్రతీరం
రేణువు రేణువూ
ఆనందాల వేణువూదుతుంది
స్వాగతిస్తున్న అలలు అలలు
మబ్బుల్లేని నిర్మల ఆకాశంలో
స్వేచ్ఛా గాలి సీతాకోకలు విహరించే
ప్రశాంత ప్రపంచం.
శతాబ్దాల అగ్ని పర్వతం ?
కడలి గర్భం నుండే బ్రద్దలై
లావాలు లావాలుగా
పొంగిపొర్లుతుంది.
భగభగ భానుడి గుండెలో
నిప్పుకణాలు తీక్షణఉష్ణాల
ఎర్రెర్రని లావాలు
రగులుతున్న రాకాసిమంటలు
పొగలు క్రమ్మిన నల్లని ఆకాశం
బహుశా
వల వేసిన మృత్యుపాశం.
అక్కడా
నేల నేల కాదు
గాలి గాలి కాదు
ఇసుక ఇసుక కాదు
అలలు అలలు కావు
సముద్రం సముద్రం కాదు.
బహుశా
జీవితం సముద్రమే
అగ్ని పర్వతం
ఒక అధికారమనుకుంటా
ఒక అహంకారమనుకుంటా
ఒక అనుమానమనుకుంటా
ఒక స్వార్థమనుకుంటా.
ఈ అగ్నిపర్వతం
చల్లారెదెప్పుడు?

-రమేశ్ నల్లగొండ

# సామాజిక స్పృహ కలిగిన "పున్న శతకం"

పుస్తక సమీక్ష

తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానం సంపాదించుకున్న సాహిత్యప్రక్రియ శతకం. ఈ శతక ప్రక్రియకు మూలస్థానం తెలంగాణమే. ఇది మల్లికార్జున పండితుని శివతత్వ సారంగా ప్రారంభమై, తొలి తెలుగు శతకంగా సాహిత్య సంస్కార విప్లవ మూర్తి పాల్కురికి సోమనాథుడు రాసిన వృషాధిప శతకంగా, సుమతీ శతకంగా విశాలమై, దాశరథి శతకంగా దేదీప్యమానంగా తెలుగు సాహిత్యాన్ని సంపన్నం చేసింది. శతకం ద్వారా సమాజంలో మానవీయ విలువలను పెంపొందించ వచ్చు.

ఈ పున్నశతకం "పున్నా" అను ఏక పద మకుటంతో కందపద్యాల్లో శతకం రాయబడినది. ఇందులో వర్తమాన సమాజంలో కొట్టొచ్చినట్టు కనిపించే ఒక్కొక్క అంశం మీద పద్యాలు రాస్తూ పరితృలోకానికి కళ్ళకు కట్టినట్లు 108 పద్యాల్లో సహజమైన శైలిలో, సరళమైన పద్యాలతో అందరికీ అర్థమయ్యే, విధంగా ద్రాక్షాపాకం లో కందాల అందాల్ని ఆవిష్కరింపజేశారు పున్నమి (పున్న అంజయ్య).

**సమాజంలోని వైరుధ్యా లనూ, మానవ స్వభావ రీతులను, లోతుగా పరిశీలించి ప్రజా వ్యవహార భాషలో శక్తివంతంగా నానా రుచిరార్థసూక్తులతో నవ్యంగా, దివ్యంగా, భవ్యంగా చెప్పారు.**

సంఖ్య, మకుట, చందో నియమాలు శతకానికి ప్రధాన లక్షణాలు. ఈ శతకాల్లో ప్రధానంగా సమాజం వక్రగతిన పయనిస్తున్నప్పుడు, నీతి నియమాలు అడుగంటిపోతున్నప్పుడు పతనమైపోతున్న మానవీయ విలువల్ని ప్రతి మనిషి హృదయంలో పాదుగొల్పడానికి శతక కవులు ప్రయత్నం చేశారు. సరిగ్గా అలాంటి కోవకు చెందినదే పున్న అంజయ్య గారి కలం నుండి జాలువారిన ఈ **"పున్న శతకం".**

ఈ శతకంలో రైతు, మతం, మాట విలువ, లంచాలు, లోభి, యువత చెడు మార్గం, మద్యపానం, మోసం, ఆకలి, సెల్ ఫోన్,ఓటు, నీరు, చెట్టు, తెలుగు భాష, చదువు, తెలంగాణ, చెడు వ్యక్తులు, ఆంగ్లభాష వ్యామోహం, గురువు గొప్పదనం, రాజకీయం, అనే సామాజిక అంశాలపై పద్యాలు రాయడం ఒకెత్తు అయితే కందపద్యంలో రాయడం మరోఎత్తు. తడ బాటు లేకుండా చక్కని కవితా ధారతో భాష సరళంగా, భావం విషయ పరిపక్వం కూడా

భాషా సౌలభ్యం, భావ సౌందర్యము సహజమైన శైలి తెలంగాణ నుడికారంతో సుబోధకంగా హృదయానికి హత్తుకుపోయే విధంగా రాయడం" పున్న శతకం" ప్రత్యేకత. అంతే కాక సామాజికాంశాల పరంగాను పండితులను, పామరులను, సామాజిక చింతనాపరులను సమానంగా ఆకట్టుకోగలదు.

కవి పున్నమిగారు లోకంలోని మంచి సెబ్బరలను, ఈర్ష్య ద్వేషాలను, స్వార్థచింతనను, అవినీతి, దుర్గుణాలను పిసినారి చేష్టలను, కుహన రాజకీయాలను, కుటిల సంస్కారాలను, కక్షలను, కార్పణ్యాలను తన పద్యాల ద్వారా తూర్పారబట్టారు. ఇందులో చాలావరకు సామాజికాంశాలే చోటు చేసుకున్నాయి.

పున్న అంజయ్య గారు సమాజాన్ని అనేక కోణాలలో అర్థం చేసుకున్నారు. సమాజంలోని వైరుధ్యాలనూ, మానవ స్వభావ రీతులను, లోతుగా పరిశీలించి ప్రజా వ్యవహార భాషలో శక్తివంతంగా నానారుచిరార్థసూక్తులతో నవ్యంగా, దివ్యంగా, భవ్యంగా చెప్పారు.

నేటి సమాజంలో మాతృభాషకు



**ప్రతులకు:** పున్న అంజయ్య
6-2-954/2, రోడ్‌నెం.3
కాకతీయ నగర్,
నల్లగొండ-508 001.
సెల్: 93966 10639

పట్టిన దుస్థితిని చూసేకవి ఆవేదన చెందాడు. అమృతం కన్నా కమ్మని తీయనైన తెలుగును మర్చిపోతూ విద్యార్థులు అర్థం కాని వచ్చిరాని ఇంగ్లీష్ లో మమ్మీ డాడీ అని పిలవడం చూసి కవి ఆవేదన చెందారు కింది పద్యంలో...

**మమ్మీ డాడీల చదువు**
**అమ్మాయని పిలుచుటేది?**
**ఆప్యాయంగా**
**కమ్మని మన భాష తెలుగు**
**ఇమ్మహిలో లేదు అమృతమ్మది**
**పున్న...** 32

శతక కర్త ఈ ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని ఓటు విలువ గురించి, గుప్తంగా నోట్లు తీసుకుని ఓటును అమ్ముకోవడాన్ని నిరసిస్తూ ఇలా తన పద్యంలో..

**కూటికి కరువైయున్నను**
**ఓటుకు విలువ ఉంది చూడు**
**ఒకసారైనన్**
**నోటుకు ఓటును అమ్ముట**
**నేటి ప్రజాస్వామ్య రీతి నెరుగర**
**పున్నా.....** 7

కవి చదువు యొక్క ప్రాముఖ్యతను గాక పుస్తకం యొక్క ప్రాముఖ్యతను కూడా తెలియజేశారు. "చిరిగిన చొక్కా అయిన తొడుక్కో కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో" అన్నారు మహానుభావుడు కందుకూరి వీరేశలింగం. స్నేహితుడు బాధల్లో ఉంటే ఓదార్చగలడు సలహాలు కానీ ఒక మంచి పుస్తకం ఉంటే వీటితో పాటు జ్ఞానాన్ని కూడా పెంచి మనసుకు ఊరట నిస్తుంది పుస్తకం. పుస్తకమే పూర్ణతనిస్తుందని తెలుపుతూ పుస్తకాన్ని మించిన ధనం లేదంటారు ఇలా కవి...

**పుస్తక పఠనం గొప్పది**
**పుస్తకమొక నేస్తమై ప్రపంచం చూపును**
**పుస్తకమే విజ్ఞానము**
**మస్తకమందు వెలుగొందు**
**మరువకు పున్నా**

అలాగే...

"వృక్షో రక్షతి రక్షితః" వృక్షాన్ని రక్షిస్తే అది నిన్ను రక్షిస్తుందని తెలుపుతూ తప్పక మొక్క నాటవల్సిందిగా కోరుతూ పర్యావరణ కలిగినవాడిగా చెట్టు ఉపయోగాలను తెలియపరుస్తాడు. త్యాగాన్ని ప్రతిరూపంగా చెట్టును కీర్తిస్తాడు.

చెట్టును కాపాడు కోవడానికి ప్రతిజ్ఞ చేద్దామని ఆహ్వానిస్తాడు. పర్యావరణంలో మరో కీలక అంశం నీరు. నీటి పొదుపు ఆవిష్కరణ తెలిపే పద్యాలు పాఠకుల ను ఎంతో ఆకట్టుకుంటాయి. మతాలతో మనుషులు పడే సతమతము లను చక్కగా విశ్లేషించారు. విద్యాధనం సర్వధన ప్రధానమైనది. మనిషికి చదువును మించిన సంపద లేదు.

చదువు మంచిచెడుని తెలియజేస్తుంది. చక్కటి శిక్షణను ఇస్తుంది. జీవితానికి ప్రకాశాన్ని కలిగిస్తుంది. పూజ్యతను, గౌరవాన్ని కలిగిస్తుందని కాబట్టి మనిషికి జీవమే చదవని చదువు యొక్క సహాయాన్ని వెల్లడించారు. సమాజంలో మనుషులు మానవత్వాన్ని మరిచిపోయి కొందరు విద్యగర్వంతో, ధనగర్వంతో, మరికొందరు అధికారగర్వంతో వెరిసి మానవులు మదగర్వంతో వ్యవహరిస్తున్న తీరును నిరసించారు కవి...

లంచం ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంది. వ్యక్తిత్వాన్ని చంపుతుంది. మంచి చెడులను మర్చిపోయెలా లంచం ఎంత నీచమైన పనినైనా చేస్తుందని విశ్లేషించారు ఈ క్రింది పద్యంలో.....

**లంచములిచ్చుట పెరిగెను**
**లంచము పుచ్చుకొనుటంతో**
**అధికములాయెను**
**లంచము లేకుండా ఫైలు**
**కొంచెమునైనను కదలదు**
**కొలువుల పున్న...** (12)

ఇలా, ఈ శతకంలో కవి తను చెప్పదలుచుకున్న విషయం, సరళంగా, సూటిగా చెప్పడం కవి ప్రత్యేకత. చదివిన ప్రతిపాఠకుడు ఆలోచించి, ఆస్వాదించేలా, ఆలోచనాత్మకంగా ఒక ప్రయోజనాన్ని ఆశించి రాసింది శతకం. శైలిలో పాఠకుడి మెదడు పొరల్లో చైతన్యబీజం నాటినట్లుగా ఇందులో కనబడుతుంది.

ఆయన పద్యాల్లో భాషసరళం. భావం సందేశాత్మకం. వర్తమానావశ్యక విషయాలను, ప్రస్తుతం పెడదారులు పట్టిన ఈ సమాజానికి మార్గనిర్దేశం చేస్తున్నట్లు ప్రధానంగా ఈ శతకంలో కనిపిస్తుంది.

కందం "కవి ప్రతిభకు ప్రతీక, పున్న వారి కందాలలో అభివ్యక్తి ఆలోచనాత్మకం. శైలి సుందరంగా, సులభంగా ఉంది. అంతేకాదు భావంలో స్పష్టత, భాషలో ధారాళత కల్గి, శతకంలో ఎక్కడా భాషా అంబరానికి గానీ, ప్రాసాలంకారాలకుగానీ, కవి ప్రయాసపడలేదు. "పున్నా" అనే మకుటంతో మనిషి నిద్రలేపుతున్నట్లుగా ఉన్నది. ఇందులోని ప్రతి పద్యం అర్థవంతమైనదే. పున్న అంజయ్య గారు ధారశుద్ధి కలిగిన కవి. గతంలో కూడా "పున్నమయ్య పలుకు వెన్న జిలుగు" అనే మకటంతో పున్నమి వెలుగులు శతకాన్ని, "విశ్వ రూపాయ వరదాయ విమల చరిత విశ్వ రూప శతకాన్ని రాసి పరిపక్వత చెందిన కవి. అందుకే ఈ రచనల్లో ఆయన సృజనాత్మక శక్తి కన్పిస్తుంది.

ఒక మంచి కావ్యాన్ని తెలుగు సారస్వతానికి అందించారు.

ఇంతటి ఉత్తమ కృతి రాసిన ఆత్మీయ సోదరులు, సాహితీ మిత్రులు పున్నమి (పున్న అంజయ్య) గారికి శుభాభినందనలు తెలియజేస్తూ, ఆయన కలం నుండి ఉత్తరోత్తర ఎన్నో ఉత్తమ కృతులు రావాలని నా వంతగా కోరుకుంటున్నాను.



-రెబ్బ మల్లికార్జున్
9701047345

# సామాజిక చైతన్యంలో కవుల పాత్ర కీలకం - దాస్యం సేనాధిపతి



పుస్తకావిష్కరణలో అతిథులు





సభలో ప్రసంగిస్తున్న దాస్యం సేనాధిపతి

సామాజిక చైతన్యంలో కవుల పాత్ర కీలకం అని ప్రముఖ కవి ,విమర్శకులు, ఉదయ సాహితీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు దాస్యం సేనాధిపతి అన్నారు. శనివారం నాడు స్థానిక ఫిలిం భవన్ లో ఉదయ సాహితీ తెలంగాణ ఆధ్వర్యంలో కవి గోల్కొండ రాములు రచించిన ఆయిటి సినుకులు కవితా సంపుటి ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై గ్రంధాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రాములు కవిత్వంలో ఆయన ఉత్తమ వ్యక్తిత్వం ,సున్నిత మనస్తత్వం ,సామాజిక చింతనలు ముప్పేట అల్లుకుపోయాయని కొనియాడారు. రాములు తమ అనుభవాన్ని రంగరించి రాసిన ఇందలి కవితలు సమాజ జాగృతికి దోహదపడేలా ఉన్నాయని అభినందించారు. రాములు ఎంపిక చేసుకున్న కవిత వస్తువులు వైవిధ్యంగా ఉన్నాయని అభివ్యక్తిలో సరళత్వానికి పెద్దపీట వేశారని తెలిపారు. పద్య రచనలు తలపించే విధంగా ఇందలి మినీ కవితలు కొలువుదీరాయని అన్నారు. మున్ముందు పూర్తిస్థాయి వచన కవితా సంపుటి వారి కలం నుండి జాలువారాలని కోరారు. సభకు విశిష్ట అతిథిగా హాజరైన స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్ జె డి కే .సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాములు తమ స్వీయ అనుభవాలను మేళవించి ,తమ పరిశీలన పటిమను జోడించి ఇందలి కవితల్ని తీర్చిదిద్దారని అభినందించారు. గౌరవాతిథిగా పాల్గొన్న రాజేశ్వర్ రాములు గారితో ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న మేజర్ రేళ్ల సంజీవ్ మాట్లాడుతూ రాములు కవిత్వంలో సమాజానికి ఉపయోగపడే హితోక్తులు ఉన్నాయని కొనియాడారు .నైతిక విలువలు నిర్మాణం చేయడానికి ఇందలి కవితలు దోహదపడగలవని అన్నారు. ప్రముఖ సాహితీ వేత్త ఉదయ సాహితీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ దాస్యం లక్ష్మయ్య మాట్లాడుతూ రాములు కవిత్వంలో సమాజ చిత్రణ అద్భుతంగా జరిగిందని కొనియాడారు. పుస్తకాన్ని సభకు పరిచయం చేస్తూ ప్రముఖ కవయిత్రి కాసనగొట్టు స్వప్న రాములు కవితా సంపుటిలోని మధురిమలను విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో కవులు స్తంభంకాడి గంగాధర్, కూకట్ల తిరుపతి, యోగా సంపత్ కుమార్, శ్రీమతి ఇందిర ప్రసంగించారు.

ఉదయ సాహితీ తెలంగాణ పక్షాన కవి గోల్కొండ రాములను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ కనకయ్య ,దామెర కుంట శంకరయ్య, నగునూరి రాజన్న, నీలగిరి అనిత బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చిందం సునీత అతిథులను సభకు పరిచయం చేయగా, బొమ్మ కంటి కిషన్ వందన సమర్పణ చేశారు.

# డాక్టర్ వోలేటి ఉమా సరస్వతి పద్య కవిత సంపుటి 'జీవన సౌరభాలు' ఆవిష్కరణ





"పద్యానికి 1000 సంవత్సరాల చరిత్ర ఉందని తెలుగువారు ప్రాణప్రదంగా ప్రేమించే సాహిత్యం పద్యము అని" అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. జూన్ 15 సాయంత్రం విజయవాడ బుక్ ఫెస్టివల్స్ సొసైటీ మీటింగ్ హాల్లో కృష్ణాజిల్లా రచయితల సంఘం సౌజన్యంతో జరిగిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి పద్య కవిత సంపుటి **జీవన సౌరభాలు** పుస్తకాన్ని బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కవిత్వం రాస్తూనే ఒక ఉపాధ్యాయునిగా విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంతోపాటు.. పద్య కవిత్వాన్ని కూడా వారికి నేర్పుతూ తెలుగు భాషాభివృద్ధికి ఇతోధిక సేవ చేస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రచయితలసంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో డాక్టర్ జీవీ పూర్ణచంద్ గౌరవ అతిథిగా పాల్గొని రచయిత్రి రాసిన రచనలోని గొప్పతనాన్ని విశదీకరించారు. డాక్టర్ గుమ్మ సాంబశివరావు పుస్తక సమీక్ష చేస్తూ "మంచి కవిత్వం చిరస్థాయిగా ఉంటుందని.. పద్య కవిత్వం కనుమరుగవుతున్న దశలో రచయిత్రి ఉమా సరస్వతి మంచి పద్య కవిత్వం రాసి భవిష్యత్ తరాలకి మార్గదర్శియ్యారని అభినందించారు. శర్మ సిహెచ్ స్వాగత వచనాలతో ప్రారంభమైన ఈ సభలో ప్రముఖ సాహితీవేత్తలు, రచయిత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మట్టితనపు తడి ఉంటే

కనురెప్పల కదలికలో
కలల అలల పదనిసలు..
కదిలే కాలపు ఒడిలో
ఊహల ఊసుల సరిగమలు...
రెప్పపాటు కాలానికి
రెక్కలు తొడిగే కళలు...
చక్కనైన భావానికి
కన్నులు పలికే కథలు.
సమయ సుధా వాహినిలో
వెలుగు నీడల సడులు..
మనసులోని శృతిలయలే
జీవన దీప్తికి హ్వాయలు..
మనిషితనపు తడి ఉంటే
బ్రతుకంతా పరిమళమే..
మట్టితనపు మనసుంటే
అడుగడుగూ మధువనమే..
కాలం చెక్కిన శిలలకు
వన్నెలు దిద్దే మనసున
ఎన్నెన్నో తపనలు..
సమయపు తరగతి గదిలో
అనునిత్యం ఒక అధ్యాయం
అణకువగా మెలకువగా
మదిని నిలిపి ప్రతి నిత్యం
పాఠం నేర్వాలి మనం..



-వెల్మల
జయపాల్ రెడ్డి
9441168976

## ఆకాశం ఎర్రబడింది

అక్కడ
అబలపై జరుగుతున్న
అత్యాచారాన్ని చూచి
ఆకాశం ఎర్రబడింది.
అక్కడ
దారిదోపిడీలు చేస్తున్న
దొంగలముఠాను చూచి
ఆకాశం ఎర్రబడింది.
అక్కడ
అమానుషంగా
అమాయకులను నరకటంకని
ఆకాశం ఎర్రబడింది.
అక్కడ
ఎన్నో దౌర్జన్యాలనుచేసి
ఎన్నుకోబడిన నేతనుచూచి
ఆకాశం ఎర్రబడింది.
అక్కడ
అప్పుడేపుట్టిన శిశువును
చెత్తబుట్టల్లో వేయటంచూచి
ఆకాశం ఎర్రబడింది.
అక్కడ
అమ్మానాన్నలను గెంటుతున్న
తనయులనుచూచి
ఆకాశం ఎర్రబడింది.
అక్కడ
లంచాలు తీసుకుంటున్న
అవినీతి అధికారులనుచూచి
ఆకాశం ఎర్రబడింది.



-గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

# 'గోల్డెన్ ఇయర్స్ ఆఫ్ ది గ్లోరియస్' ఆవిష్కరణ

గత మూడేళ్ల (2022-25)లో మధ్య రైల్వే జోన్‌లోని వివిధ విభాగాలు సాధించిన విజయాల సంకలనంగా రూపొందించిన 'గోల్డెన్ ఇయర్స్ ఆఫ్ ది గ్లోరియస్' పుస్తకాన్ని రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ఆవిష్కరించారు. సోమవారం రైల్ నిలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైల్వే కార్యకలాపాలు, సమయపాలన, లోడింగ్, విద్యుదీకరణ, డబ్లింగ్, ట్రిప్లింగ్ సిగ్నలింగ్ తదితర అంశాల్లో దక్షిణ మధ్య రైల్వే వృద్ధిని ఈ పుస్తకం హైలెట్ చేస్తుందన్నారు. అనంతరం రైల్ కళారంగంలో ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్/మొబైల్ అప్లికేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు జీఎం నీరజ్ అగర్వాల్‌తో కలిసి ఎంపాయీ ఆఫ్ ది మంత్ భద్రతా అవార్డులను ప్రదానం చేశారు.



పుస్తకావిష్కరణలో అతిథులు

# నిజాయితీ

కథ



నరసింహపురంలో శరభయ్య అనే రైతు ఉండేవాడు. అతడు ఒకరోజు కూరగాయలతో సంతకు వెళ్ళాడు. అక్కడ దారిలో అతనికి ఒక బంగారు ఉంగరం దొరికింది. అది గమనించిన అతడు దాన్ని తీసుకొని తన వద్ద పెట్టుకున్నాడు.

అప్పుడు కొందరు పిల్లలు ఇది చూసి ఆ దొరికిన వస్తువును అతనినే తీసుకోమని చెప్పారు. అప్పుడు శరభయ్య " పిల్లలూ! అలా ఇతరుల సొమ్ము తీసుకోకూడదు. అది పరుల సొమ్ము . పరుల సొమ్ము పాము వంటిదని మీరు వినలేదా! దానిని పోగొట్టుకున్న వారు ఎంతో బాధపడతారు. ఇది వారిని చేరితేనే నాకు తృప్తి ,ఆనందం!" అని అన్నాడు.

ఇంతలో అది చూసిన సంతలోని ఒక వ్యక్తి శరభయ్య దగ్గరకు వచ్చి ఆ దొరికిన వస్తువు తనదేనన్నాడు . అప్పుడు శరభయ్య అదేమిటో చెప్పమన్నాడు. అతడు కొంచెం తటపటాయించి "బంగారు హారం "అన్నాడు. శరభయ్య అది కానే కాదని అన్నాడు. అతడు వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత అక్కడకు మరో వ్యక్తి వచ్చి' అది బంగారు ఉంగరం' అన్నాడు .

దాని రాయి ఏ రంగులో ఉందో చెప్పమన్నాడు శరభయ్య. అతడు" గులాబీ రంగు రాయి" అని అన్నాడు. అప్పుడు శరభయ్య ఆ రంగు కానే కాదని అన్నాడు . అతడు వెళ్లిపోయాడు.

ఆ తర్వాత మరొక వ్యక్తి వచ్చి "అది ఆకుపచ్చ రంగు రాయి "అని అన్నాడు. అసలు ఆ రంగు కానే కాదని శరభయ్య అనేసరికి ఆ వ్యక్తి కూడా వెళ్లిపోయాడు.

ఆ తర్వాత ఒక స్త్రీ ఏడ్చుకుంటూ వచ్చి "అయ్యా! ఈ సంతలో నా ఉంగరం పోయింది . మీకు దొరికిందా! ఒకవేళ అది దొరికితే మాత్రం అది నాదే ! అది ఇక్కడే పడిపోయింది. దానికి ఏ రాయి లేదు " అని చెప్పింది. వెంటనే శరభయ్య ఆ ఉంగరాన్ని చూసి ఆమె చెప్పిన ఆనవాళ్లు సరిగా ఉండటంతో ఆమెకి ఇచ్చి వేశాడు .

అప్పుడు అక్కడి వ్యక్తులు " ఆ ఉంగరం ఈమెదే అని ఎలా నిర్ధారించారు" అని ప్రశ్నించారు. అప్పుడు శరభయ్య "ఏముంది ! ఆమె చెప్పిన ఆనవాళ్లు సరిగ్గా సరిపోయాయి.

అంతే కాకుండా ఆమె ఏడుస్తోంది . నిజంగా తమ విలువైన వస్తువులు పోయిన వాళ్ళు ఎంతో బాధతో ఉంటారు.

వారి ముఖం ఆందోళన చూస్తేనే మనం గుర్తుపట్టవచ్చు. కన్నీళ్లు కూడా ఊరకె రావు కదా! ఇదివరకు వ్యక్తులు అలా లేరు. అందువల్లనే అది ఆమెదేనని గ్రహించాను"అని అన్నాడు.

ఆమె పోయిన తన ఉంగరం ఇచ్చినందుకు బహుమతిగా కొంత డబ్బు ఆ శరభయ్యకు ఇవ్వబోతే అతడు దానిని సున్నితంగా తిరస్కరించాడు. ఆ శరభయ్య నిజాయితీని అక్కడున్న వారందరూ అభినందించారు.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

